## వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం

భక్తజన సందోహంతో పులకించిన శ్రీవారి పుష్కరిణి

సుదర్శన చక్ర స్పర్శతో పావనమైన పుష్కరిణి జలాలు



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 24 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 260 | పేజీలు: 8+4 | వెల రూ.5

## 'ది ప్యారడైజ్'తో నా కల నిజమైంది.. : శ్రీకాంత్ ఓదెల



8

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM




# స్థానిక ఎన్నికల్లో మంత్రులదే బాధ్యత

## సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

> అభివృద్ధికి ఐటీ.. పాలనకు స్పీడ్.. ఎన్నికలకు కసరత్తు... ఇదీ.. బుధవారం సీఎం చంద్రబాబు కేబినెట్ సమావేశం... కీలక అంశాలు..! రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు సంచలన దిశానిర్దేశం చేశారు.

**(అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి):** పాలనలో వేగం పెంచుతూనే, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. అటు అమరావతిని వరల్ క్లాస్ హెల్త్కేర్ హబ్గా మారుస్తామని ప్రకటిస్తూ, ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యవస్థాపకుడు ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ విజన్ అని స్పష్టం చేశారు. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత పూర్తిగా ఆయా జిల్లాల ఇన్ఛార్జ్ మంత్రులదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను దశలవారీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు.

**ఉద్యోగులకు గుడ్ న్యూస్ - డీఏల విడుదల**

కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై స్పందించిన సీఎం, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న రెండు డీఏల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అక్టోబర్ 1 నుంచి ఈ చెల్లింపులు ప్రారంభమవుతాయని, అలాగే 12వ పీఆర్సీ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. అమరావతిలో ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాజధాని నగరంలో అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. 12 ఎకరాల్లో నిర్మించే ఈ సంస్థ ద్వారా ఏటా 3 లక్షల మందికి పైగా కంటి వైద్యం అందుతుందని

...మిగతా 2లో

## లడ్డూ ప్రసాదం ఏటీఎం

ఇంద్రకీలాద్రిలో రాష్ట్రంలోనే తొలిసారి

ఫేక్ పూజా టికెట్లపై అప్రమత్తం



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) కొండ దిగువన, అర్జునవీధి ప్రారంభంలోని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'లడ్డూ ప్రసాదం ఏటీఎం' (స్వయంచాలక లడ్డూ విక్రయ యంత్రం)ను దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఈరోజు ఉదయం


...మిగతా 2లో

## సిఎం సతీమణి భువనేశ్వరిని కలసిన డాక్టర్ ఏలూరి

వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని కోరిన ఏలూరి

తప్పక సందర్శిస్తానన్న భువనేశ్వరి

2



## మచిలీపట్నంలో గోవా షిప్యార్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

ఎంపీ వల్లభనేని బాలశౌరి హర్షం

2



## చిన్నతనంలోనే కండరాల క్షీణత గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

మంత్రి కందుల దుర్గేష్

2



## చంద్రబాబు పాలనంతా అరాచకపర్వం

ప్రశ్నిస్తే అక్రమ కేసులు. వేధింపులు

అన్నింటినీ ప్రజల్లో గట్టిగా ఎండగట్టాలి

వైయస్ జగన్ పిలుపు

2



## తుఫానుపై ఆర్టీజీఎస్ అప్రమత్తం

## నిరంతర పర్యవేక్షణ

ప్రభావిత జిల్లాల యంత్రాంగంతో సమన్వయం

తుఫాను గమనంపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేత

2



## తుఫాను హెచ్చరికలు, భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

అవసరం ఉన్న చోట పునరావాస శిబిరాల నిర్వహణలో పాలుపంచుకోవాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



పాలకొల్లు, సెప్టెంబర్ 23,మనం ప్రతినిధి: రాష్ట్రంలో తుపాను హెచ్చరికలు, భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు.ఈ మేరకు సోషల్ మీడియా లో ప్రకటన వైరల్ అవుతోంది.ఉత్తరాంధ్ర ప్రాంతంపై తుపాను ప్రభావం తీవ్రంగా

...మిగతా 2లో

## శాప్ ఆఫీస్ వద్ద దాడిపై అన్ని ఆధారాలతో గవర్నర్కు ఫిర్యాదు చేశాం



డీఎస్సీ-2025 స్కాం సీబీఐ విచారణ జరిపించాలని కోరాం

వైయస్ జగన్ వెల్లడి

విజయవాడ,సెప్టెంబర్,23,(మనం ప్రతినిధి): లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ను కలిసిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి. శాప్ కార్యాలయం వద్ద వైయస్సార్‌సీపీ నాయకులపై జరిగిన దాడికి సంబంధించి ఆయన గవర్నర్కు ఫిర్యాదు చేశారు. అలాగే

...మిగతా 2లో

## శభాష్ సాయి...

## బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్

మంత్రి సవిత అభినందనలు



తాడేపల్లి/అమరావతి,సెప్టెంబర్23,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల విద్యార్థి, బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సాయికుమార్, కోచ్ జూనా నాయక్, ప్రిన్సిపాల్ వై.రమేశ్ బుధవారం

...మిగతా 2లో

## సచివాలయంలో మంత్రి దుర్గేష్ సమీక్ష




గోదావరి పుష్కరాలు, ఇన్-బౌండ్ టూరిజం వృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ

రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రచారాలు, రోడ్ షోలు నిర్వహించాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

అమరావతి,సెప్టెంబర్,23,(మనం ప్రత్యేక ప్రతినిధి): సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పర్యాటక, సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్ లో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్ లతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరంలో పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన ఏర్పాట్లు,

...మిగతా 2లో



## మంటలు రేపనున్న సూపర్ ఎల్‌నినో

అక్టోబర్ నుంచి 2027 ఫిబ్రవరి దాకా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం

4.5 లక్షల మందిని హతమారుస్తుందన్న క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక

భయంగొలిపే మరిన్ని అంశాలను వెల్లడించిన రిపోర్టు

1996-2025ను బేస్ లైన్‌గా తీసుకొని తయారు చేసిన ఈ రిపోర్టు

న్యూయార్క్, సెప్టెంబర్ 23 : ప్రపంచవ్యాప్తంగా పేద దేశాల్లో సూపర్ ఎల్ నినోతో లక్షల సంఖ్యలో ప్రాణాలు పోతాయని క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి మధ్యలో కనీసం 4.5 లక్షల మంది ఎండ వేడికి దుర్మరణం పాలబడే ప్రమాదముందని అది తెలిపింది. మన దేశంలోనూ వేల సంఖ్యలో మరణాలు సంభవించొచ్చని నివేదిక వెల్లడించింది.

పేద దేశాలపై ఎక్కువ దృష్టి సారించింది. ఆఫ్రికాలోని 'సాహిల్ రీజియన్' (ఆఫ్రికా మధ్యలోని 9 దేశాల్లో ఐదువేల కిలోమీటర్లు విస్తరించిన ప్రాంతం)లో 66,800 మంది వేడిమి కారణంగా.. అదనంగా చనిపోవచ్చని వెల్లడించింది. వీటిల్లో 31,400 మరణాలు నైజీరియాలో, 17,500 మరణాలు సుడాన్లో, 10,000 మరణాలు నైజెర్లో, 8,000 మరణాలు ఛాద్ లో నమోదు కావొచ్చని నివేదికలో అంచనా కట్టింది. ఇక ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్ లాండ్, కంబోడియాలో కలిపి

...మిగతా 2లో


## అత్యంత సంపన్నుడు అదానీ

ఆస్తుల్లో అంబానీని మించిపోయిండు

ఈ ఇద్దరి తరువాత మూడో స్థానంలో లక్ష్మీ నివాస్ మిట్టల్

భారత దేశంలో సంపన్నుల జాబితా విడుదల

2



## స్థానిక ఎన్నికల్లో మంత్రులదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు.'ప్రతి ఇంట్లో ఒక బిజినెస్మెన్ కావాలి'టెక్నాలజీ రంగంలో గతంలో ఐటీకి తాము ఊతమిచ్చామని, ఇప్పుడు 'క్వాంటం కంప్యూటింగ్' యుగం నడుస్తోందని సీఎం గుర్తుచేశారు. ఏపీలోని ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంట్రప్రెన్యూర్, ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా ఎదగాలనేదే తన అసలైన విజన్ అని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.5. అక్టోబర్ 2న మెగా ప్రాజెక్టురాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా అక్టోబర్ 2న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో కలిసి మదనపల్లెలో రూ. 1 లక్ష కోట్ల రాయలసీమ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన చేయనున్నట్లు బుధవారం నాటి సమీక్షలో సీఎం వెల్లడించారు.

## అంబానీని మించిపోయిన అదానీ

**ముంబై, సెప్టెంబర్ 23 :** దేశంలో అత్యంత సంపన్నుడుగా అదానీ రికార్డు సృష్టించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని అధిగమించిన గౌతమ్ ఆదానీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు హురున్ ఇండియా రిచ్ లిస్ట్- 2026 వెల్లడించింది. అదానీ కుటుంబ ఆదాయం 13 శాతం పెరిగి రూ.9.23 లక్షల కోట్లకు చేరింది. ముకేశ్ అంబానీ కుటుంబ ఆదాయం 10 శాతం తగ్గి రూ.8.63 లక్షల కోట్లుగా నమోదైంది. అంబానీతో పోలిస్తే అదానీ ఆదాయ పరంగా రూ.59,400 కోట్ల ఆధిక్యంలో ఉండటం గమనార్హం. ఈ రిచ్ లిస్ట్లో ఆర్సెలర్ మిట్టల్కు చెందిన ఎల్.ఎన్.మిట్టల్, ఆయన కుటుంబం మూడో స్థానంలో నిలిచింది. మిట్టల్ సంపద 93 శాతం పెరిగి రూ.3.39 లక్షల కోట్లకు చేరింది.

**సంపన్న మహిళల్లోనూ పెరుగుదలే..**

గతేడాదితో పోలిస్తే 131 మంది మహిళలు కొత్తగా చోటు సంపాదించారు. వీరిలో రోష్ని నాడార్ మల్హోత్రా, ఆమె కుటుంబం రూ.2.79 లక్షల కోట్ల ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో పెరిగింది. గతేడాదిలో కొత్తగా 27 మంది బిలియనీర్లు చేరడంతో వీరి సంఖ్య 391 మందికి పెరిగింది. అత్యధిక సంపన్నులు గల నగరాల్లో ముంబయి అగ్రస్థానంలో నిలిచింది. బెంగళూరు, ఢిల్లీ.. రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

## వైభవోపేతంగా చక్రధారుడి చక్రస్నానం



తిరుమల సెప్టెంబరు 23 మనం న్యూస్: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ముగింపుగా చివరి రోజున ఉదయం శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం (అవభృథం) అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

**శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం...**

అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య శ్రీ భూవరాహస్వామివారి ఆలయ ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్రచామరాది రాజోపచారాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణల ద్వారా అభిషేకం చేశారు.

**వేద మంత్ర ఘోషతో ఆధ్యాత్మిక పరిమళం**

ఈ సందర్భంగా టీటీడీ వేదపారాయణదారులు ఉపనిషత్తు, దశశాంతి, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం తదితర మంత్రాలను ఘనంగా పారాయణం చేశారు. అభిషేకానంతరం శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి దివ్య ప్రబంధ పాశురాలను పఠించారు.

**ఉత్సవ యజ్ఞానికి సంపూర్ణత చేకూర్చే అవభృథం**

తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన సమస్త సేవలు సఫలమై, లోకక్షేమం, భక్తుల సుఖశాంతులు కలగాలని చక్రస్నానం నిర్వహించడం సంప్రదాయం. బ్రహ్మోత్సవాలు ఒక యజ్ఞస్వరూపం కాగా, యజ్ఞాంతంలో నిర్వహించే అవభృథస్నానం ద్వారా ఉత్సవ నిర్వహణలో జరిగిన లోపదోషాలు తొలగి, సంపూర్ణ ఫలితాలు చేకూరుతాయని ఆగమ సంప్రదాయం.

**సుదర్శన చక్ర స్పర్శతో పావనమైన పుష్కరిణి**

స్నపన తిరుమంజనం అనంతరం శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లను శ్రీవారి పుష్కరిణికి తీసుకువచ్చి పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. సుదర్శన చక్ర స్పర్శతో పుష్కరిణి జలాలు మరింత పావనమయ్యాయని విశ్వసిస్తూ, అదే సమయంలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. చక్రస్నానాన్ని దర్శించిన, నిర్వహించిన, సహకరించిన భక్తులందరికీ బ్రహ్మోత్సవ యజ్ఞఫలం లభించాలని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టీటీడీ సీఈ మనోహరం, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, శ్రీవారి సేవకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంటలు రేపనున్న సూపర్ ఎల్‌నినో

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్తంగా 19,400 అదనపు మరణాలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఒక్క ఇండోనేసియాలోనే 19,300 మంది ప్రాణాలు కోల్పోతారని చెప్పింది. పెరిగిన ఉష్ణోగ్రతలు తట్టుకోలేక.. భారత్ లో 15,800, బ్రెజిల్లో 13,300 మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ దేశాల్లో రానున్న వేసవిలో కూడా మరణాలు నిలకడగా పెరిగే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది.

**ముందస్తు చర్యల కోసమే నివేదిక తయారీ..**

ప్రభుత్వాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా తమ నివేదిక ఉపయోగపడుతుందని ది క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తుగా హీట్ వార్నింగ్స్ జారీ చేయడం, కూలింగ్ సెంటర్లు నిర్వహించడం, తాగునీటి సౌకర్యాలను పెంచడం, ఆరుబయట పనిచేసే ఉద్యోగులకు రక్షణ ఏర్పాట్లు కల్పించడం, ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడానికి ఈ అంచనాలు ఉపయోగపడనున్నాయి. భవిష్యత్తులో ఎల్నినో మరింత బలపడుతుందని సెప్టెంబర్ 3వ తేదీన ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించింది. దీని తీవ్రత నవంబర్, డిసెంబర్ నెలల్లో తారస్థాయికి చేరుతుందని అంచనావేసింది. 2027 ఫిబ్రవరిలో కూడా ఇది కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ భావిస్తోంది. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత కూడా 1.8 డిగ్రీల సెల్సియస్ పెరిగొచ్చని ఇప్పటికే అమెరికా నేషనల్ ఓసియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. భూ ఉత్తరార్ధగోళంలో ఎల్నినో చాలా బలంగా ఉంటుందని ఈ సంస్థ వెల్లడించింది. 1901లో రికార్డుల నమోదు మొదలైన నాటి నుంచి.. ఈ ఏడాది ఆగస్టు నెల 'అత్యంత వేడిగా ఉన్న ఆగస్టు'గా చరిత్రలో నిలిచిపోతుందని ఆ వాతావరణ నివేదిక ప్రకటించింది.

## తుఫాను హెచ్చరికలు, భారీ వర్షాల నేపథ్యంలో
# అప్రమత్తంగా వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని హెచ్చరికలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా కల్వర్టులు దెబ్బతినడం, గ్రామీణ రహదారులు తెగిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్దేశం చేశారు. ఎక్కడైనా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. వరదల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట నిర్వహించే పునరావాస కేంద్రాలలో పాలు పంచుకోవాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస శిబిరాల్లో ఆహారం, రక్షిత తాగునీరు, మందులు, ఇతర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. వర్షాలు, వరదల కారణంగా పశువులు, ఇతర మూగజీవాలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాటికి అవసరమైన మేత, నీటి ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని సూచించారు. విపత్తు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక తదితర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పేర్కొన్నారు.

## శభాష్ సాయి...
### బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్

(మొదటి పేజీ తరువాయి)

మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్ ఘడ్ లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అందజేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో సాయికుమార్ కు మెళకువలు నేర్పిన కోచ్ జూనా నాయక్ ను, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ ను కూడా మంత్రి సవిత అభినందించారు.

## సచివాలయంలో మంత్రి దుర్గేష్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

టెంట్ సిటీలు, హోమ్ స్టేలు తదితర భక్తులకు మెరుగైన వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు సరికొత్త ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సౌందర్యాన్ని తెలిసేలా దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్ షోలు నిర్వహించాలన్నారు. ఏడాదంతా నిరంతరం పర్యాటక శోభ ఉట్టిపడేలా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు జరపాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులు, వాటితో జరుగుతున్న పనుల ప్రగతిని మంత్రి దుర్గేష్ సమీక్షించారు. త్వరలోనే మరిన్ని పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) కేంద్రానికి సమర్పించి, అదనపు నిధులు రాబట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## చిన్నతనంలోనే కండరాల క్షీణత గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

**అమరావతి,సెప్టెంబర్,23,(మనం ప్రత్యేక ప్రతినిధి):** అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యుల కందుల దుర్గేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 30 న మంగళగిరిలోని 'గోపు గ్రాండ్' వేదికగా జరగనున్న 'సాహస్-2026' (వీల్స్ ఆఫ్ కరేజ్) కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రి దుర్గేష్ కి ఆహ్వాన పత్రిక అందజేశారు. మస్కులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల కోసం ఈ కార్యక్రమంలో 130 ఎలక్ట్రిక్ వీల్చైర్లను పంపిణీ చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... స్వయంగా దివ్యాంగురాలైనప్పటికీ, తోటి మస్కులర్ డిస్ట్రోఫీ బాధితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శోభారాణి సుంకర చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. చిన్నతనం లోనే ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తగిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఇటువంటి మహత్తర లక్ష్యంతో ముందుకు వెళ్తున్న సంస్థలకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయి చేయి కలిపి పనిచేస్తే భవిష్యత్తులో ఈ సవాల్ను సమర్థవంతంగా అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ద్వారా శోభారాణి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తాను స్వయంగా పరిశీలించామని మంత్రి తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న ఈ బృహత్ ప్రయత్నాలు పూర్తి సత్ఫలితాలని వ్వాలని, మరిన్ని విజయాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

## సీఎం సతీమణి భువనేశ్వరిని కలసిన డాక్టర్ ఏలూరి

**మార్కాపురం, సెప్టెంబర్23,(మనం న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతిమణి భువనేశ్వరుని బుధవారం తిరుమల లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఐదు, ఆరు సంవత్సరాల నుండి ప్రజాహితమే లక్ష్యంగా గిరిజన ప్రాంతాల్లో,మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివ భక్తులకు చేపట్టిన మెడికల్ క్యాంపులు, మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి సమయంలో శానిటైజేషన్, మాస్కులు పెద్ద ఎత్తున ప్రజలకు అందించిన సేవల గురించి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి భువనేశ్వరి కి సమగ్రంగా వివరించడం జరిగింది.

ఈ సందర్భంగా లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సేవల గురించి తెలుసుకున్న భువనేశ్వరి ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల ముందు ఎన్ డి ఎ కూటమి ప్రజలకు ఇచ్చిన మేరకు అధికారమనంతరం మార్కాపురం జిల్లా ను చేయడమేగాక, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేరకు అనేక దశాబ్దాల నుండి పెండింగ్ లో ఉన్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను రిజర్వాయర్ లోకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి భువనేశ్వరి తో అన్నారు.

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ను సందర్శించాలని ఏలూరి చేసిన విజ్ఞప్తి మేరకు తప్పక సందర్శిస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, టిడిడి బోర్డు సభ్యులు వనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# లడ్డూ ప్రసాదం ఏటీఎం

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా దుర్గగుడి దేవస్థానంలో ఈ స్వయంచాలక యంత్రాన్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్భంగా దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ... దర్శనార్థం విచ్చేసే భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా, త్వరితగతిన లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి స్వయంగా క్షణాల్లో ప్రసాదం పొందేలా ఈ యంత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు.ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేసామని,ఈ పైలట్ ప్రాజెక్ట్ పనితీరును పరిశీలించిన అనంతరం, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. ఉత్సవాలు, రద్దీ రోజుల్లో కాకుండా సాధారణ రోజుల్లో ఈ యంత్రం భక్తులకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామని, దేవాలయ వ్యవస్థ లో సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామని, ప్రస్తుతం ఆన్ లైన్ విధానంలో హెచ్చు శాతం సేవల టిక్కెట్లు భక్తులు సులభంగా బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దసరా శరన్నవరాత్రుల ఏర్పాట్లు.. సామాన్య భక్తులకే అగ్రతాంబూలం: దేవాదాయశాఖ కమిషనర్ ఇంద్రకీలాద్రిపై రాబోయే దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

## మచిలీపట్నంలో గోవా షిప్యార్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

**మచిలీపట్నం, సెప్టెంబర్, 23,(మనం న్యూస్):** మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గోవా షిప్యార్డు లిమిటెడ్ ఆధ్వర్యంలో భారీ రక్షణ, నౌకా నిర్మాణ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి హర్షం వ్యక్తం చేశారు. ఈ కీలక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర కేబినెట్కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో మచిలీపట్టణం పోర్టు కేంద్రంగా గోవా షిప్యార్డు ఏర్పాటు కానుండటం నియోజకవర్గ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత కలిగిన పరిణామమని బాలశౌరి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్షంగా, 5,000 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. గోవా షిప్యార్డు లిమిటెడ్ చేపడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టు మచిలీపట్టణాన్ని రక్షణ, నౌకా నిర్మాణ రంగంలో కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత నౌకాదళం, కోస్టార్డ్ అవసరాలకు అనుగుణంగా నౌకా నిర్మాణం, మరమ్మతుల కార్యకలాపాలకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

## తుఫానుపై ఆర్టీజీఎస్ అప్రమత్తం నిరంతర పర్యవేక్షణ

**అమరావతి,సెప్టెంబర్,23,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి వాతావరణ మార్పులను, జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఆర్టీజీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్లు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, తుపాన్ కదలికలను అవేర్ విభాగం ఎప్పటికప్పుడు రియల్ టైమ్లో ట్రాక్ చేసి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభావిత జిల్లాలకు చేరవేసేలా ఏర్పాట్లు చేశారు. ఏఏ ప్రాంతాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండనుంది, రిజ్వర్వాయర్ల పరిస్థితి, వాటి క్యాచ్మెంటు ఏరియాల్లో ఎంత నీరు రావచ్చు తదితర వివరాలును జిల్లాలకు ఎప్పటికప్పుడు చేరవేసి అప్రమత్తం చేస్తున్నారు. తుఫాను కళింగపట్నం వద్ద తీరం దాటే సూచనలుండటంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం,అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాన్ని ప్రత్యేకించి అప్రమత్తం చేశారు. శ్రీకాకుళంలో ఏఏ ప్రాంతంలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశాలున్నాయో గుర్తించి ఆ జిల్లా యంత్రాంగాన్ని ముందుగానే అప్రమత్తం చేస్తున్నారు.

**అవేర్ ద్వారా అలెర్టుల జారీ**

అవేర్ విభాగం ద్వారా తుఫాను కదలికలు, దాని ప్రభావం గురించి ప్రజలకు వారి మొబైల్ ఫోన్లకు ఎప్పటికప్పుడు సమాచారం, హెచ్చరిక సందేశాలు పంపుతున్నారు. దీంతోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయిలో వరద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది, స్వర్ణ వార్డు, స్వర్ణగ్రామ సచివాలయ అధికారుల వరకు కూడా ఎప్పటిక్పుడు తుపాను పరిస్థితులు, వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని వారి మొబైల్ఫోన్లకు చేరవేస్తున్నారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టడం సులభతరమయ్యేలా చేస్తున్నారు. ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ డాక్టర్ ఎం మాధురి, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్లు పి. శ్రీఖర్, కె. చైతన్య, డి. అఖిల తదితరులు ఆయా జిల్లాల్లో పరిస్థితిని సమీక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

**రియల్ టైమ్లో వాతావరణ విశేషాలు**

ప్రజలు కూడా ఆర్టీజీఎస్ వారి అవేర్ వెబ్సైట్, యాప్ ద్వారా తామున్న చోటు నుంచే తమ మొబైల్ ఫోను ద్వారా రియల్ టైములో వాతావరణ విశేషాలు, తుపాను కదలికలను తెలుసుకోవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావం, వర్షాల తీవ్రతతో పాటు తమ ప్రాంతానికి సంబంధించిన వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు తాముున్న చోటు నుంచే తెలుసుకోవచ్చు. దీనికోసం జ్టిఇట//ఽ్రీఽ్టఽ.ఽఇఃజౌౌ.జీ/ఛ్రీఽఱఽ్టౌటఛీ వెబ్సైటును సందర్శించాలి లేదా అవేర్ యాప్ను డౌన్లోడు చేసుకోవడం ద్వారా తెలుసుకోవచ్చు.

## శాప్ ఆఫీస్ వద్ద దాడిపై అన్ని ఆధారాలతో గవర్నర్కు ఫిర్యాదు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. గవర్నర్తో భేటీ అనంతరం లోక్భవన్ వద్ద మీడియాతో జగన్ మాట్లాడారు. గవర్నర్ని కలవడం జరిగింది. గవర్నర్కి వివరంగా.. సెప్టెంబరు 21న జరిగిన ఘటనపైనే కాకుండా, ఏ విధంగా డీఎస్సీ స్కామ్లో యువత నష్టపోయింది అనేది వివరించాము. ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాలన్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డీఎస్సీ స్కాంపై కచ్చితంగా సీబీఐ విచారణ జరగాలి. విద్యా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాలి. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, నాలుగు పాయింట్ల ఆధారంగా డీఎస్సీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. 1). మొట్టమొదట రెండు ఫంక్షన్లు ఒకే వ్యక్తి చేతికి అప్పగించడం. ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ రెండూ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్కు అప్పగించారు. దీంతో స్కామ్ ప్రారంభం అయింది. 2). రెండోది మొత్తం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతిలో పెట్టారు. అలా పని చేస్తున్న నవీన్ అనే వ్యక్తికి కృష్ణా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చినా, అతడికి ఉద్యోగం ఇవ్వలేదు. తన పేరు తొలి మెరిట్ లిస్ట్లో చూపి, ఆ తర్వాత లిస్ట్లో పేరు తొలగించారు. అతడి లాగిన్ ఐడీ బ్లాక్ చేశారు. కాల్ లెటర్ కూడా పంపలేదు. దీంతో అతడు ప్రభుత్వానికి లేఖ రాయడమే కాకుండా, కోర్టుకు కూడా వెళ్లాడు. అంటే ఒక స్కామ్ను కవర్ చేయడానికి ఎన్ని అగచాట్లు పడుతున్నారు. అనేది తెలియడంతో పాటు, లీకేజీ వ్యవహారం బట్టబయలైంది. 3). స్పోర్ట్స్ కోటా పేరుతో అడ్డగోలుగా జీఓలు ఇచ్చారు. గతంలో ఉన్న జీఓలు రద్దు చేసి కొత్తగా.. జీఓ నెం: 4, 47 అని చెప్పి, రెండు కొత్త జీఓలు తెచ్చి, వాటి ద్వారా పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఆ తర్వాత 372 ఉద్యోగాలు ఆ జీఓల పేరుతో ఇచ్చారు. ఆ రిక్రూట్మెంట్ పూర్తి కాగానే మళ్లీ మూడు జీఓలు తెచ్చారు. జీఓ నెం: 23, 25, 56 తెచ్చారు. దాని ప్రకారం మళ్లీ పరీక్ష ఉండాలని నిబంధన పెట్టారు. మరి ఇక్కడ 372 మందికి ఎలా ఉద్యోగాలు ఇచ్చారన్న దానికి సమాధానం లేదు. 4). ఫేక్ సర్టిఫికెట్లు. ఏరకంగా నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ దొంగ సర్టిఫికెట్లు ఇచ్చాడో చూశాం. జరగని గేమ్స్ జరిగినట్లు చూపారు. అలాగే ఏపీ సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన ఎమ్మెల్యే కూన రవికుమార్.. దాదాపు 38 ఉద్యోగాలకు సంబంధించి, సర్టిఫికెట్లు ఇచ్చారనేది కూడా చెప్పాం. ఇంకాసాఫ్ట్బాల్ అసోసియేషన్లకు సంబంధించి కొన్ని జిల్లాలో సెక్రటరీలకు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు అనేవి కూడా చెప్పాం. డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి బేరసారాలపై ఆడియో, వీడియో కూడా బయటకు వచ్చింది. అందులో క్లియర్గా ఫోన్ నెంబర్ కనిపిస్తున్నా, ఆ వ్యక్తి గురించి ఎఫ్ఐఆర్లో రాయలేదు. కేవలం సస్పెక్ట్ అని మాత్రమే రాశారు. అరెస్టు కూడా చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయినా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు.

సెప్టెంబరు 21న శాప్ ఆఫీస్ వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముందుగానే సమాచారం ఇచ్చారు. అనుమతి కోరుతూ లెటర్ కూడా రాశాడు. కానీ, ఆరోజు ఏం జరిగింది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎలా కుట్ర చేశారో చూశాం. టీచర్లు కాని టీచర్లను పిలిపించి, ప్యారలల్గా ధర్నా చేయించాడు. నిజానికి వారు చదువు చెప్పే గురువులు కాదు. దొంగ సర్టిఫికెట్లతో, ఏ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు పొందిన వారు. అందుకే వారు టీచర్లు కానీ టీచర్లు. వారిని పిలిపించి, కావాలని శాప్ ఆఫీస్ వద్ద గొడవ చేయించారు. అంతే కాకుండా టీడీపీ గుండాలను కూడా అక్కడికి రప్పించారు. వారంతా కలిసి మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై దారుణంగా దాడి చేశారు. ఎంత దారుణంగా ఆ కేసులు పెట్టారంటే.. హత్యాయత్నం కేసులు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు పెట్టారు. ఇప్పటికే 350 మందిపై కేసులు పెట్టారు. ఆ జాబితా ఇంకా పెరుగుతోంది. ఇంకా రాత్రి వేళల్లో ఇళ్లపై బడి అరెస్టులు చేస్తున్నారు. శాంతియుత నిరసన వ్యక్తం చేస్తుంటే, రౌడీ షీట్లు ఎలా ఓపెన్ చేస్తారని నిలదీశాయి. చంద్రబాబు ప్రభుత్వంలో, రెడ్బుక్ రాజ్యాంగంలో నగరం మధ్యలో ఏ విధంగా దారుణాలు జరుగుతున్నాయి అని చెప్పడంతో పాటు, పోలీసుల అరాచకాలకు ఇవన్నీ నిదర్శనంలా నిలుస్తున్నాయని వైయస్ జగన్ అన్నారు.

## చంద్రబాబు పాలనంతా అరాచకపర్వం

**తాడేపల్లి,సెప్టెంబర్,23,(మనం ప్రతినిధి):** స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడి పోరాడాలని, ప్రజలంతా వైయస్సార్సీపీ వైపే ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్మోహన్రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనంతా అరాచకపర్వం అని, ప్రశ్నిస్తే అక్రమ కేసులు. వేధింపులు కొనసాగుతున్నాయని, వాటన్నింటినీ ప్రజల్లో గట్టిగా ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు వచ్చాకే విశాఖలో సమస్యలు మొదలయ్యాయన్న వైయస్ జగన్, నగరంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని, మూడ్రోజులకు ఓసారి నీటి సరఫరా అవుతోందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపుతో నష్టం జరుగుతోందని, దాదాపు 75 టీఎంసీల నీటి నిల్వ తగ్గుతుందని, ఆ మేరకు గోదావరి నీటిని కోల్పోతున్నామని గుర్తు చేశారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంలో అరాచకాలు జరుగుతున్నాయన్న వైయస్ జగన్, పోలీసులు గతి తప్పి వ్యవహరిస్తున్నారని, దారుణంగా వేధిస్తున్నారని తెలిపారు. డిజిటల్ డైరీతో అన్ని లెక్కలు తేలుస్తామన్న ఆయన, ఇకనైనా వారు పద్ధతి మార్చుకోవాలని కోరారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం వచ్చాక చర్యలు తప్పవని హెచ్చరించారు. వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో గ్రేటర్ విశాఖలో పార్టీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులతో పాటు, ముఖ్య కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ఏం మాట్లాడుతూ

**ప్రతి ఇంట్లో అదే చర్చ:**

మన ఐదేళ్ల పాలనకు, ప్రస్తుతం రెండున్నరేళ్ల చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ఈరోజు ప్రతి ఇంట్లో చర్చించుకుంటున్నారు. మన హయాంలో ప్రజలకు అందిన పాలనకు, ఇప్పటి పాలనకు మధ్య వ్యత్యాసం ప్రతి కుటుంబానికీ స్పష్టంగా కనిపిస్తోంది. మన ఐదేళ్ల పాలనలో గతంలో ఎన్నడూ జరగని మార్పులు తీసుకొచ్చాం. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థను మార్చాలన్న చిత్తశుద్ధితో పని చేశాం. రాజకీయాల్లో నాయకుడి మీద, పార్టీ మీద విశ్వసనీయతను పెంచేందుకు కృషి చేశాం. గతంలో మేనిఫెస్టో అంటే ఎన్నికల సమయంలో ఇష్టానుసారంగా హామీలు ఇవ్వడం, ఎన్నికలు ముగిసిన తర్వాత దాన్ని చెత్తబుట్టలో పడేయడం అనే పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితిని మార్చింది వైయస్సార్సీపీ ప్రభుత్వం. మేనిఫెస్టోను కేవలం రెండు పేజీల్లో, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తీసుకొచ్చాం. దాన్ని ఒక భగవద్గీతగా, ఖురాన్గా, బైబిల్గా భావించి 99 శాతం హామీలను అమలు చేశాం. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు అంతటి ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం మనది.

## పేద రోగులకు న్యూరోసర్జరీ విభాగంలో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతం



- స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్
- టిటిడి హై ఎండ్ థెరపీ (ప్రాణదానం), డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా దాదాపు రూ.15 లక్షల ఆర్థికసాయం

**తిరుపతి సెప్టెంబరు 23 మనం న్యూస్:** తిరుపతి: ఆర్థికంగా వెనుకబడిన రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరుపతిలోని న్యూరోసర్జరీ విభాగం అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిందని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ తెలిపారు. మెడ నొప్పి సమస్యతో వచ్చిన 67 ఏళ్ల పేషెంట్ క్లిష్టమైన న్యూరోసర్జరీ శస్త్ర చికిత్ససత్యసాయి జిల్లా ఉడుమలకుర్తి గ్రామానికి చెందిన 67 ఏళ్ల నాగిరెడ్డి సిద్ధారెడ్డి మెడ భాగంలో తీవ్రమైన నొప్పి, ఇతర సమస్యలతో స్విమ్స్కు వచ్చారు. వైద్య పరీక్షలు, అవసరమైన స్కానింగ్ల అనంతరం రోగి పరిస్థితిని న్యూరోసర్జరీ వైద్యులు సమగ్రంగా పరిశీలించారు.రోగి పరిస్థితికి అనుగుణంగా అవసరమైన క్లిష్టమైన న్యూరోసర్జరీ చికిత్సను అత్యాధునిక వైద్య సాంకేతికతతో విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రోగి వైద్యుల పర్యవేక్షణలో పాల్గొని బుధవారం డిశ్చార్జ్ చేయడం జరిగింది. ఈ చికిత్సకు తిరుమల తిరుపతి దేవస్థానములు హై ఎండ్ థెరపీ (ప్రాణదానం) పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందింది.అస్లీప్' విధానంలో పేషెంట్ బొక్క నాగ సతీష్కు జిపిఐ-డిబిఎస్ పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం గ్రామానికి చెందిన 23 ఏళ్ల బొక్క నాగ సతీష్కు స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగంలో అత్యాధునిక (జిపిఐ-డిబిఎస్) చికిత్సను 'అస్లీప్ డిబిఎస్' విధానంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ విధానంలో రోగిని మేల్కొలిపి ఉంచకుండా, ముందస్తు ప్రణాళిక, అధునాతన ఇమేజింగ్, ఖచ్చితమైన నావిగేషన్ మరియు సాంకేతిక మార్గదర్శకత్వంతో మెదడులోని నిర్దిష్ట ప్రాంతమైన (జిపిఐ)లో ఇరువైపులా ప్రత్యేక ఎలక్ట్రోడ్లను అత్యంత ఖచ్చితత్వంతో అమర్చారు.అనంతరం ఈ ఎలక్ట్రోడ్లను ప్రత్యేకమైన స్టిమ్యులేటర్ వ్యవస్థకు అనుసంధానం చేసి అవసరమైన న్యూరోమోడ్యులేషన్ చికిత్స అందించారు. ఈ విధానాన్ని రోగిని మేల్కొలిపి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం 'ఎస్లీప్ డిబిఎస్' ప్రత్యేకతగా వైద్యులు తెలిపారు.ఈ అత్యాధునిక చికిత్సకు టిటిడి (ప్రాణదానం పథకం) ద్వారా రూ.5 లక్షలు, డా. ఎన్.టి.ఆర్. వైద్యసేవ ట్రస్ట్ ద్వారా మరో రూ.5 లక్షలు, మొత్తంగా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. విజయవంతంగా నిర్వహించారు పేషెంట్ కోరుకొని ఈరోజు డిశ్చార్జి చేయడం జరిగింది.

# తుమ్మలగుంటలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

### పుణ్యస్నానం ఆచరించిన చెవిరెడ్డి దంపతులు

### పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిసిన కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



**తిరుపతి రూరల్ సెప్టెంబరు23 మనం న్యూస్:** తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజు ఉదయం ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకన్నకు, సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. చక్రతాళ్వార్కు చక్రస్నానం నిర్వహించిన అనంతరం భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి గోవింద నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు వారి కుమారులు చెవిరెడ్డి మోహిత్రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్రెడ్డి పాల్గొన్నారు.

**లోక సంక్షేమం కోసం చక్రస్నానం**

తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వెన్నంటి ఉండి అన్ని వాహన సేవలు, క్రతువులు విజయవంతంగా నిర్వహించిన చక్రతాళ్వార్కు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీ. లోక సంక్షేమం, భక్తుల సుఖశాంతులను ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర క్రతువును నిర్వహించారు. రాత్రి తిరుచ్చి వాహనంపై శ్రీ కల్యాణ వెంకన్న, చక్రతాళ్వార్ విహరించారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించి, కుంభజలంతో గర్భాలయంలో సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించడంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు సంపూర్ణమయ్యాయి.

**అందరి సహకారంతో విజయవంతం**

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు గ్రామస్తులు, భక్తులు, ప్రజలు, ఆలయ సిబ్బంది, అధికారుల సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




## తిరుపతి తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలి

- త్రాగునీరు అందించకుంటే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు

**తిరుపతి సెప్టెంబరు 23 మనం న్యూస్:** తిరుపతి నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు. ఈరోజు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు మాట్లాడుతూ, తిరుపతి నగరంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మూడు రోజులకు ఒకసారి మాత్రమే తెలుగు గంగ నీటిని సరఫరా చేయడంతో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తాగునీటి సమస్య ఏర్పడితే కార్పొరేషన్ ఎన్నికలవేళ ప్రజలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.వర్షపు నీటిని తిరుపతి పరిసర ప్రాంతాల్లోని చెరువులకు మళ్లించి వాటిని నింపడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తిరుపతి నగర భవిష్యత్ అవసరాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం శాశ్వత ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కైలాసగిరి రిజర్వాయర్కు అనుసంధానంగా మరో రెండు రిజర్వాయర్లను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు జలాశయం నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హంద్రీ-నీవా నీటిని తిరుపతి, తిరుమల తాగునీటి అవసరాలకు సత్వరం మళ్లించాలని కోరారు.సిపిఐ సీనియర్ నాయకులు టి. జనార్ధన్ మాట్లాడుతూ, తిరుపతి నగరంలో ప్రతిరోజూ తాగునీటి అవసరాలను తీర్చేలా తెలుగు గంగ నీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని కోరారు. నగర జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి వనరులను పెంచడంతో పాటు ఇప్పటికే చేపట్టిన జలాశయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు



**తిరుపతి, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు 'ఆపరేషన్ త్రిశూల్' లో భాగంగా గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్ ను జిల్లా కలెక్టర్, ఎస్పి లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి శాంతిభద్రతల అంశం పై సమీక్ష సందర్భంగా డ్రగ్ మెనేస్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు వంటి మూడు ప్రధాన అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా సమగ్రంగా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మూడు అంశాలను కేవలం జిల్లా స్థాయిలో సమీక్షించడం కాకుండా మైక్రో లెవెల్ వరకు తీసుకెళ్ళి, వార్డు, గ్రామ, పంచాయతీ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా పోలీస్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితర క్షేత్రస్థాయి సిబ్బందిని ఒక సమన్వయ బృందంగా ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో గృహ హింస, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఎదురయ్యే సమస్యలు వంటి అంశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కిశోర బాలికలకు మహిళా పోలీసుల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్తో పాటు మహిళలు, బాలికల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో అవగాహన, కౌన్సెలింగ్, పరీక్షలు, తనిఖీలతో పాటు డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, సరఫరా గొలుసుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాలేజీ విద్యార్థులు, వలస కార్మికులు, గతంలో డ్రగ్స్ వినియోగం లేదా సరఫరాతో సంబంధం ఉన్న వ్యక్తులు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి లక్ష్యిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.
డ్రగ్స్ వినియోగించే వారిని కౌన్సెలింగ్, అవగాహన, పునరావాసం ద్వారా సాధారణ జీవనంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడంతో పాటు, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యాసంస్థలు, సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎంఈఓలు, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓలతో సమన్వయం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే పలు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ప్రమాదానికి కారణాలను విశ్లేషించి, రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను తక్షణమే గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# తుమ్మలగుంటలో.. విభూది విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు!

- ముందుగా చక్రతీర్థంతో అభిషేకించిన వేద పండితులు
- ఆ తరువాత వేద మంత్రాల నడుమ నిమజ్జనాన్ని ప్రారంభించిన చెవిరెడ్డి


**తిరుపతి సెప్టెంబరు23 మనం న్యూస్:** తుమ్మలగుంటలో కొలువుదీరిన విభూది విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు. 11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిమజ్జనానికి ముందు టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి విభూది వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాల వినాయక కమిటీ ఛైర్మన్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.చక్రతీర్థంతో ప్రత్యేక అభిషేకం తుమ్మలగుంటలో జరుగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా లభించిన చక్రతీర్థంతో విభూది వినాయకుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిమజ్జనంలో చెవిరెడ్డి మోహిత్రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్రెడ్డిలు పాల్గొన్నారు. నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తుమ్మల గుంటలో భక్తి సందడి నెలకొంది.

**ఏడు టన్నుల విభూదితో విగ్రహం**

శ్రీశైలం, మహానంది తదితర శైవక్షేత్రాల నుంచి సేకరించిన పవిత్ర విభూదితో సుమారు ఏడు టన్నుల భారీ విగ్రహాన్ని రూపొందించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ విభూది వినాయకుడిని 11 రోజుల పాటు భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలోనూ స్వామి వారిని చివరిసారిగా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**విభూది ప్రసాదం కోసం భక్తుల ఆసక్తి**

నిమజ్జనం సందర్భంగా విగ్రహంలోని పవిత్ర విభూదిని ప్రసాదంగా స్వీకరించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. విభూది కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరికీ పవిత్ర విభూది ప్రసాదం అందేలా బాల వినాయక కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. దీంతో విభూది వినాయకుడి నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.



## చిత్తూరు జిల్లాలో సర్ ప్రక్రియ వేగవంతం

### బీఎల్ఓల ద్వారా ఫోటో నాణ్యత పరిశీలనలో 9,20,404 ఫోటోలు ఆమోదం

### వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ సమావేశం



**చిత్తూరు సెప్టెంబర్ 23 మనం న్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం, ఓటర్ల జాబితా పరిశీలన మరియు ఇతర సమస్యల పై జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి

**కె.మోహన్ కుమార్ మాట్లాడుతూ**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల్లో భాగంగా ఈ నెల కూడా ఓటర్ల జాబితా సవరణ, నోటీసుల జారీ, పరిశీలన వంటి ప్రక్రియల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఎస్ఐఆర్ నోటీసులు క్లెయిమ్లు డ్రాఫ్ట్ రోల్లో నమోదైన నోటీసులపై సమగ్ర విచారణ పూర్తిచేసి, అర్హులైన అభ్యర్థుల డేటాను ఫైనల్ పబ్లికేషన్ కోసం పంపడం జరిగింది. క్లెయిమ్లు, అభ్యంతరాలు, ఫారమ్-6, ఫారమ్-7 ఫారమ్-8ల దాఖలు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ, అనర్హులైన లేదా డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్ల సమాచారాన్ని క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం సవరిస్తున్నామని పేర్కొన్నారు.ఇప్పటి వరకు జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు, విచారణలు, ఫారమ్ల పరిశీలన, ఫోటో నాణ్యత తనిఖీ తదితర ప్రక్రియలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 170-నగరి, 171-జీడీ నెల్లూరు (ఎస్సీ), 172-చిత్తూరు, 173-పూతలపట్టు (ఎస్సీ), 174-పలమనేరు, 175-కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నోటీసులు విచారణకు సంబంధించిసెప్టెంబర్ 22, 2026 నాటికి జిల్లాలో మొత్తం 1,34,307 నోటీసులు జనరేట్ కాగా, అదే సంఖ్యలో నోటీసులు అందజేయడం జరిగింది. మొత్తం 1,34,307 నోటీసులకు సంబంధించి విచారణలు నిర్వహించబడ్డాయి. విచారణ తేదీ ముగిసినవి, రీషెడ్యూల్ అయినవి, ఐదు రోజులకు పైగా పెండింగ్లో ఉన్న కేసులు ఏవీ లేవని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అలాగే 25,726 కేసులు వెరిఫై చేయగా, 7 కేసులు నాట్ వెరిఫైడ్గా నమోదయ్యాయి. తుది ప్రకటనకు అనర్హంగా గుర్తించినవి 2,489 కాగా, తుది ప్రచురణకు సంబంధించి నోటీసులతో 1,31,818 కేసులు, ఇతర కారణాలతో తుది ప్రచురణకు 10,69,754 కేసులు నమోదు అయ్యాయని, ఫారమ్ల స్వీకరణ, పరిశీలనకు సంబంధించి 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 22 వరకు జిల్లాలో వివిధ రకాలుగా మొత్తం 2,22,096 ఫారమ్లు సమర్పించబడ్డాయి. ఇందులో 1,40,733 ఆఫ్లైన్, 81,363 ఆన్లైన్ ద్వారా సమర్పించబడ్డాయి.



# వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు

**వెంకటగిరి సెప్టెంబర్ 23 మనం న్యూస్:** వెంకటగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.బుధవారం వెంకటగిరి నగరం పింజలి వీరయ్య కళ్యాణ మండపం నందు జిల్లా కలెక్టర్ వెంకటగిరి ఎమ్మెల్యే కొరుగొండ్ల రామకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ బానుప్రకాష్ రెడ్డి, పోలేరమ్మ ఆలయ చైర్మన్ గొల్లగుంట మురళి కృష్ణ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ మరియు శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ దేవస్థానం ప్రత్యేక అధికారి విజయరాజు, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వెంకటగిరి పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ఘటోత్సవంతో జాతర ప్రారంభమై, సెప్టెంబర్ 30న అమ్మవారి ప్రధాన ఉత్సవం, అక్టోబర్ 1న నిలువు, నిష్క్రమణ కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని వివరించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున గత సంవత్సరాల్లో ఎదురైన చిన్నచిన్న సమస్యలను సమీక్షించి, ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్యూ మేనేజ్మెంట్, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా సుమారు 1,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. వీఐపీ దర్శనాలను ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా సమయాన్ని నిర్ణయించామని, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.'స్త్రీ శక్తి' పథకాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల రవాణా కోసం గత సంవత్సరం 90 బస్సులు ఏర్పాటు చేయగా, ఈ సంవత్సరం 150 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఎదురైన చిన్నచిన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.
భక్తుల సంఖ్య గతంలో కంటే 30 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకుని క్యూ లైన్లు, పార్కింగ్, ట్రాఫిక్ మార్గాలను ముందుగానే ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం బస్సులు సరిపోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని కోరినట్లు, సుమారు 50 అదనపు బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వడమే ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భక్తులు క్రమపద్ధతిలో క్యూ లైన్ల ద్వారా వెళ్ళి ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# పార్టీ ఉంటేనే మనకు విలువ..

## కూటమి పార్టీల నిర్ణయానికి కట్టుబడాల్సిందే

- ప్రజలతో ఉండండి, చేసిన అభివృద్ధిని చెప్పండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించాలి
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు సెప్టెంబరు23 మనం న్యూస్ :** పార్టీ అధికారంలో ఉంటేనే మనకు గుర్తింపు ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికల సన్నద్ధతా సమావేశం బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, పరిశీలకులు కుమారి ఇతర సీనియర్ నాయకుల పాల్గొన్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తక్కువ సమయం ఉండడంతో నాయకులు, సంబంధిత వార్డుల ఇన్చార్జిలు, కమిటీల సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో ఉంటూ, మనం చేసిన అభివృద్ధిని చూపించాలని, క్షేత్రస్థాయిలో కష్టపడే వారికి, పార్టీ పట్ల అంకితభావం ఉన్న వారికే గుర్తింపు, అవకాశాలు వస్తాయన్నారు. కూటమి పార్టీలోని జనసేన, భాజపాలకు అవకాశాలు కల్పించాల్సిన నేపథ్యంలో.. కొన్నిచోట్ల అనుకున్న వారికి అవకాశాలు దక్కకపోవచ్చు అని.. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. అవకాశం దక్కని నిజమైన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యామ్నాయంగా పదవులు, అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలను బేరీజు వేసుకొని పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో వైకాపా నాయకులు అసత్యాలు ఆడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని, వీటిని ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వద్దకు తీసుకెళ్లడంతో పాటుగా.. వైకాపా నాయకుల దౌర్జన్యాలు, దురాగతాలను, వారి అక్రమ వ్యాపారాల గురించి ప్రజలను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఎదుటివారిని విమర్శించే ముందు.. మనం ఎంత సంసారులమో ఒకసారి సరి చూసుకోవాలని వైకాపా నాయకులకు చురకలు అంటించారు. వైకాపా నాయకుల అక్రమాలు, అక్రమ ఇసుక రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, గులకరాళ్ళ అక్రమ రవాణా, మైనింగ్ లో చేసిన అక్రమాలను త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామన్నారు.

## పక్షే నిత్య గురువు!

పక్షికి
పాఠశాల లేదంటే
గురువూ లేనట్లే!

రెక్కలొస్తే చాలు
తల్లి గూడుకు సైతం
నిరాపేక్ష వీడుకోలు!

స్వీయ పరిశీలనతోనే
నిత్య ఆకాశ విహారం
ఆహార అన్వేషణం!

సరిహద్దుల్లేని రాజ్యంలో
దానికి ప్రభువులు పోలీసుల్లేరు
నింగీ నేలా మధ్య ఏ నిబంధనల్లేవ్!

ఆకలైతే చాలు
వేట మొదలైతది
కడుపు నిండితే చెట్టు గుర్తొస్తది!

బంధాలు లేవు
రక్త సంబంధాలు లేవు
మైమరిస్తే కొమ్మ చాటుగానం!

ఉరుములురిమి
నదీ నదాలు ఉప్పొంగి పారుతుంటే
చేప పిల్ల నోటి కందితే అది అలెగ్జాండరే!

దారెంటా
కుప్పకూలిన పక్షి కనిపిస్తే
ఆకాశమెత్తరిచి సమాచారం చేరవేస్తది!

వలల్ని మనం విసురుతాం
అది మనిషిని నమ్మినప్పుడల్లా
అశువులు కోల్పోతుంది!

నిత్యం పలు భయాల మధ్య
నలిగిపోయే నాగరికపు మనిషికి
పక్షే నిత్య గురువు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# పీఎంశ్రీ పాఠశాలలే భవిష్యత్తు



భవిష్యత్ భారతానికి పీఎం శ్రీ పాఠశాల విద్యకు చిరునామా అయితే గ్రంథాలయం జ్ఞానానికి హృదయం. భారత దేశ పాఠశాల విద్యా వ్యవస్థ నేడు ఒక కొత్త మలుపు తిరుగుతోంది. ఒకప్పుడు పాఠశాల అంటే తరగతి గది, బ్లాక్‌బోర్డు, పాఠ్యపుస్తకం, పరీక్షలు అనే పరిమిత భావన ఉండేది. కానీ నేటి విద్యార్థి ప్రపంచం మరింత విశాలమైంది. చేతిలోని చిన్న తెరపై ప్రపంచ జ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో విద్య అంటే కేవలం పాఠ్యాంశాలను కంఠస్థం చేయడం కాదు. ఆలోచించడం, ప్రశ్నించడం, అన్వేషించడం, సృజించడం, నేర్చుకోవడం, అవసరమైతే నేర్చుకున్నదాన్ని మరచి కొత్తగా నేర్చుకోవడం. ఈ మారుతున్న విద్యా దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PM SHRI) పథకం పాఠశాల విద్యలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. 2022 సెప్టెంబర్ 7న ప్రారంభమైన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 14,500కు పైగా ఉన్న పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. 2026 జూలై నాటికి 13,092 పాఠశాలలు పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపిక కావడం ఈ ప్రయాణం ఎంత విస్తృతంగా సాగుతోందో తెలియజేస్తోంది.

ఈ పథకానికి 2022-23 నుంచి 2026-27 వరకు ₹27,360 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయం కేటాయించబడింది. అయితే ఒక ఆదర్శ పాఠశాల అంటే కేవలం అందమైన భవనం, స్మార్ట్ తరగతి గదులు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు మాత్రమే కాదు. ఆ పాఠశాలలో పుస్తకం పట్ల ప్రేమ, జ్ఞానం పట్ల ఆసక్తి, ప్రశ్నించే మనస్తత్వం, చదివే సంస్కృతి ఉంటేనే అది నిజమైన ఆదర్శ పాఠశాల అవుతుంది.

గ్రంథాలయం - పాఠశాల విద్యకు ప్రాణహితం. తరగతి గది విద్యార్థికి పాఠాన్ని నేర్పుతుంది. గ్రంథాలయం జీవితాన్ని చదవడం నేర్పుతుంది. పీఎం శ్రీ పాఠశాలల లక్ష్యాలను పరిశీలిస్తే పాఠశాల గ్రంథాలయాలకు మరింత విస్తృతమైన పాత్ర కల్పించాల్సిన అవసరం స్పష్టమవుతుంది. పాఠశాలలోని గ్రంథాలయం ఒక గది కాదు. అది విద్యార్థి కలలకు తొలి వేదిక, ప్రశ్నలకు తొలి చిరునామా, ఊహాశక్తికి తొలి రెక్క.

ఒక చిన్నారి తొలిసారి కథల పుస్తకాన్ని తెరిచినప్పుడు అతని ముందు ఒక కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది. ఒక చరిత్ర పుస్తకం చదివినప్పుడు గతాన్ని తెలుసుకుంటాడు. విజ్ఞాన గ్రంథం చదివినప్పుడు ప్రకృతి రహస్యాలను అన్వేషిస్తాడు. జీవిత చరిత్ర చదివినప్పుడు మహనీయుల పోరాటాల నుంచి స్ఫూర్తి పొందుతాడు. సాహిత్యం చదివినప్పుడు మానవత్వాన్ని అర్థం చేసుకుంటాడు. అందుకే పాఠశాల గ్రంథాలయం పుస్తకాల నిల్వ కేంద్రం కాదు. వ్యక్తిత్వ నిర్మాణ కేంద్రం.




పుస్తకం నుంచి డిజిటల్ జ్ఞానం వరకు పీఎం శ్రీ పాఠశాలలు సాంకేతికతను విద్యలో భాగం చేస్తున్నాయి. ఐసిటి సౌకర్యాలు, స్మార్ట్ తరగతి గదులు, ఇంటర్నెట్, స్టెమ్ కార్యక్రమాలు, SIKSHA వంటి డిజిటల్ వేదికలు విద్యార్థులకు విస్తృతమైన అభ్యాస అవకాశాలను అందిస్తున్నాయి. అయితే డిజిటల్ ప్రపంచం ఎంత విస్తరించినా పుస్తకానికి ఉన్న విలువ తగ్గదు. నిజానికి భౌతిక పుస్తకం-డిజిటల్ పుస్తకం-ఈ-వనరులు-ఆడియో విజువల్ వనరులు అన్నింటినీ కలిపిన ఆధునిక పాఠశాల గ్రంథాలయమే భవిష్యత్ విద్యకు సరైన వేదిక.

డిజిటల్ తెర జ్ఞానాన్ని వేగంగా అందించవచ్చు. కానీ పుస్తకం ఆ జ్ఞానాన్ని మనసులో లోతుగా నాటుతుంది. పీఎం శ్రీ పాఠశాలల్లో సంస్కృతం, ఉర్దూ, ప్రాంతీయ భాషలకు చెందిన వేలాది మంది ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారు.ఈ నేపథ్యంలో పాఠశాల గ్రంథాలయాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఇంగ్లిష్‌తోపాటు స్థానిక భాషల బాలసాహిత్యం అందుబాటులో ఉండాలి. ఎందుకంటే పిల్లవాడు తన మాతృభాషలో చదివిన కథను కేవలం చదవడు. దాన్ని అనుభవిస్తాడు. మాతృభాషలో చదివిన పుస్తకం బాలుడి కళ్లకు అక్షరాలను మాత్రమే కాదు హృదయానికి అనుభూతులను అందిస్తుంది.

చదివే పాఠశాలే ఆలోచించే పాఠశాల పీఎం శ్రీ పథకం అనుభవాత్మక, ప్రశ్నాధారిత, విద్యార్థి కేంద్రిత అభ్యాసానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించగలవు. పాఠశాలల్లో Reading Hour, Book Review, Storytelling, Library Quiz, Essay Writing, debate, Reading Clubs, Author Interaction, Newspaper Reading, Current Affairs Corner వంటి కార్యక్రమాలను నిర్వహిస్తే విద్యార్థుల్లో పఠన అలవాటు పెరుగుతుంది. పుస్తకం చదివిన విద్యార్థి ప్రశ్నిస్తాడు. ప్రశ్నించిన విద్యార్థి ఆలోచిస్తాడు. ఆలోచించిన విద్యార్థి సృజిస్తాడు. చదివే పిల్లవాడు పరీక్షను మాత్రమే కాదు జీవితాన్ని కూడా ఎదుర్కోవడం నేర్చుకుంటాడు.

హరిత పాఠశాల- జ్ఞాన పాఠశాల పీఎంశ్రీలో Green School భావనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను విద్యార్థులకు ఆచరణలో నేర్పాలి. ఇక్కడ కూడా గ్రంథాలయం ఒక జ్ఞాన కేంద్రంగా నిలవాలి. పర్యావరణం, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్యం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక పుస్తక విభాగాలను ఏర్పాటు చేయాలి. పచ్చని ప్రాంగణం పాఠశాలకు అందాన్ని ఇస్తే పుస్తకాల పరిమళం ఆ పాఠశాలకు ఆత్మను ఇస్తుంది.

ఉపాధ్యాయుడు మార్గదర్శి. గ్రంథపాలకుడు జ్ఞాన సహచరుడు. పీఎంశ్రీలో ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. అయితే ఆధునిక పాఠశాలలో గ్రంథపాలకుడి పాత్రను కూడా మరింత బలోపేతం చేయాలి. గ్రంథపాలకుడు కేవలం పుస్తకాలు ఇచ్చే వ్యక్తి కాదు. విద్యార్థి ఆసక్తిని గుర్తించి సరైన పుస్తకాన్ని సూచించే జ్ఞాన మార్గదర్శి. డిజిటల్ వనరులను ఎలా ఉపయోగించాలి? విశ్వసనీయ సమాచారాన్ని ఎలాగుర్తించాలి? తప్పుడు సమాచారాన్ని ఎలా నివారించాలి? పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని ఎలా సేకరించాలి? వంటి అంశాల్లో విద్యార్థులకు గ్రంథపాలకుడు మార్గనిర్దేశం చేయగలడు.

13,092 పాఠశాలలు - ఒక జ్ఞానోద్యమానికి అవకాశం. దేశవ్యాప్తంగా ఇప్పటికే 13,092 పీఎం శ్రీ పాఠశాలలు ఎంపిక కావడం ఒక సంఖ్య మాత్రమే కాదు. అది లక్షలాది బాలల భవిష్యత్తుతో ముడిపడిన ఒక మహత్తర బాధ్యత. ఈ పాఠశాలలు తమ పరిసర ప్రాంతాల్లోని ఇతర పాఠశాలలకు మెంటరింగ్, సహకారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పీఎంశ్రీ పాఠశాలలో అభివృద్ధి చెందిన గ్రంథాలయాన్ని చుట్టుపక్కల పాఠశాలలకు జ్ఞాన కేంద్రంగా ఉపయోగించవచ్చు. పుస్తక ప్రదర్శనలు, సంయుక్త పఠన కార్యక్రమాలు, మొబైల్ లైబ్రరీలు, డిజిటల్ లైబ్రరీ సేవలు, పఠనోత్సవాలు నిర్వహించడం ద్వారా ఒక పాఠశాలలో మొదలైన పఠనోద్యమాన్ని అనేక పాఠశాలలకు విస్తరించవచ్చు.

భవిష్యత్ భారతానికి పుస్తకమే పునాది. పీఎం శ్రీ పథకం పాఠశాల విద్యను కేవలం మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సమగ్ర, సమాన, సమ్మిళిత, భవిష్యత్‌కు సిద్ధమైన విద్యా వ్యవస్థ వైపు తీసుకెళ్లే ప్రయత్నం. కానీ భవిష్యత్ భారతదేశాన్ని నిర్మించేది కేవలం సాంకేతికత కాదు. సాంకేతికతకు మానవత్వాన్ని, జ్ఞానానికి విలువలను, విద్యకు ఆలోచనను, పాఠశాలకు పఠన సంస్కృతిని జోడించాలి. అందుకే పీఎంశ్రీ పాఠశాలలో ఒక సజీవమైన, ఆధునికమైన, సమృద్ధమైన గ్రంథాలయం ఉండాలి. ప్రతి విద్యార్థి చేతిలో ఒక పుస్తకం ఉండాలి. ప్రతి పాఠశాలలో ఒక పఠన గంట ఉండాలి. ప్రతి గ్రామంలో పుస్తకం గురించి మాట్లాడే వాతావరణం ఏర్పడాలి.

పాఠశాలలు భవిష్యత్‌ను నిర్మిస్తాయి.గ్రంథాలయాలు ఆ భవిష్యత్‌కు ఆలోచనను అందిస్తాయి. ప్రతి పాఠశాల ఆదర్శ పాఠశాల కావాలి. ప్రతి తరగతి జ్ఞాన తరగతి కావాలి. ప్రతి విద్యార్థి పాఠకుడు కావాలి. ప్రతి పాఠశాల గ్రంథాలయం ఒక జ్ఞానదీపంగా వెలగాలి. అప్పుడు మాత్రమే పీఎం శ్రీ పాఠశాలల కల-జ్ఞానం, నైపుణ్యం, విలువలు, సృజనాత్మకత కలిగిన నూతన భారత పౌరుల నిర్మాణం-నిజమైన సాకారం అవుతుంది.


**- డాక్టర్ రవి కుమార్ చేగొని**

# ప్రపంచ శాంతి గాల్లో దీపం అయ్యిందా!



ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయి. ప్రత్యక్ష, పరోక్ష, ప్రచ్ఛన్న యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. శాంతి పావురాలు స్వేచ్ఛగా తిగలేని దుస్థితి వచ్చింది. ఏండ్ల తరబడి యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. 24 ఫిబ్రవరి 20 22న ప్రారంభంపైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేటికీ మారణహోమాన్ని నమోదు చేస్తూనే ఉన్నది. 7 అక్టోబర్ 2023న ప్రారంభమైన ఇజ్రాయిల్ - పాలస్తీనా (గాజా) యుద్ధం నేటికీ బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నది. 28 ఫిబ్రవరి 2026 నుంచి నేటి వరకు అమెరికా/ఇజ్రాయిల్.. ఇరాన్ యుద్ధం కొనసాగుతూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నది. ఈ యుద్ధాల్లో లక్షల ప్రాణాలు గాల్లో కలిసాయి. మిలియన్ల అమాయక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని వలసలు వెళుతూనే ఉన్నారు లేదా శరణార్థి శిబిరాల్లో దుర్భర జీవితాలను గడుపుతూనే ఉన్నారు. భారత్ - పాకిస్థాన్ మధ్య అనిశ్చిత స్థితి కొనసాగుతూనే ఉన్నది. యుద్ధాలను, సంక్షోభాలను ఆపడానికి ఐరాస మధ్యవర్తిత్వం పనిచేయడం లేదు. ఐరాస పేపర్ టైగర్‌గా మారింది. ట్రంప్ నాటకాలు కూడా ప్రపంచ అశాంతికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలతో ప్రాణ ఆస్తి నష్టాలతో పాటు మానవ హక్కులు హననం చేయబడుతున్నాయి. రష్యా, ఇజ్రాయిల్ దేశాల నాయకులు పుతిన్, నేతన్యాహూల అనాలోచిత ఆలోచనలతో యుద్ధాలు తీవ్రరూపం దాల్చడానికి దోహదపడుతున్నాయి. అస్థిరత రాజ్యమేలు తున్నది. ఆధిపత్య ధోరిణి రెట్టింపు అవుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం నెలకొనడానికి 1981లో ఐరాస తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ శాంతిదినం (ఇంటర్నేషనల్ పీస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. శాంతి నెలకొన్నప్పుడు పేదరికం తగ్గుతుంది, సామాజిక సహనశీలత పెరుగుతుంది. శాంతి స్థాపనకు పెట్టుబడి పెట్టండి.. అందరికీ, ప్రతి



చోట, ప్రతి రోజు అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచాన్ని సాయుధ పోరాటాలు, విపరీత వాతావరణ ప్రతికూల మార్పులు, భౌగోళిక ఆర్థిక సంక్షోభాలు, తప్పుడు వార్తలు లేదా సమాచారాల వ్యాప్తి, సామాజిక భావ విచ్ఛిన్నం, ఆర్థిక అడ్డంకులు, నిరుద్యోగం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఉగ్రవాదం, అసమానతలు లాంటివి ప్రపంచ శాంతిని హరిస్తున్నాయి.

నేడు 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే క్షణాల్లో ప్రపంచం కాలి బూడిద కావడం ఖాయంగా తోస్తున్నది. డిజిటల్ యుద్ధ నీతి భూమిని మరుభూమిగా మార్చగలదు. ప్రపంచ శత్రువులుగా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు రాజ్యమేలుతున్న వేళ అత్యాధునిక ఆయుధాలతో రక్తపాత యుద్ధాలు అర్థరహితం. కోవిడ్ విపత్తు యుద్ధాన్ని గెలిచాం. వాతావరణ ప్రతికూల మార్పులతో పోరులో నెగ్గుదాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడం పట్ల నిలిచి గెలుద్దాం.

మానవత్వమే శాంతి మహా మంత్రంగా నిత్యం జపిద్దాం. స్వీయ నియంత్రణ, పరమత సహనాలతో శాంతి పావురాలు స్వేచ్ఛగా ఎగరాలి. యుద్ధాలతో శాంతి స్థాపన జరగదు. సంక్షోభాలతో సంక్షేమం ఫలించదు. చేతులు కలిపితే అభివృద్ధి, కయ్యానికి కాలు దువ్వితే అధోగతి తప్పదు. బాంబులతో విధ్వంసం, జవాబులతో వికాసం జరుగుతుంది. సరిహద్దులు చెరిగిపోయి, డిజిటల్ వలయంలో ప్రపంచమే కుగ్రామం అయిన వేళ శాంతి మాత్రమే మానవాళి శ్రేయస్సుకు పునాది అవుతుందని అని తెలుసుకోవాలి.

ప్రపంచ శాంతికి ఉపకరించే విధంగా పేదరిక, ఆకలి రహిత సమాజ స్థాపన, విద్య వైద్య లింగ అసమానతలు, క్లీన్ ఎనర్జీ-నీటి లభ్యత, గ్లోబల్ సమన్వయం లాంటి ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 నిర్ణయించబడ్డాయి.

ప్రపంచ శాంతి కోసం చర్చలు, సదస్సులు, విద్యాలయాల్లో పోటీలు, కార్యశాలలు లాంటివని నిర్వహించాలి. అహింస, పరస్పర గౌరవం, లోతైన అవగాహన లాంటి భావనలను ప్రోత్సహించాలి. అన్ని ఆయుధాల కన్న శక్తివంతమైనది శాంతి మాత్రమే అని తెలుసుకుందాం. విభేదాలు మరిచి ఐక్యంగా ముందుకు సాగుదాం. మానవ హక్కులకు పట్టం కడదాం. యుద్ధాలు, మానవ ప్రేరేపిత సంక్షోభాలకు చరమగీతం పాడుదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# 2028లో మూడు పార్టీలకు అసలు పరీక్ష



అధికారం ఎవరి సొత్తూ కాదు. ఓటరు ఎవరికీ శాశ్వతంగా పట్టం కట్టడు. తెలంగాణ రాజకీయ చరిత్ర ఈ విషయాన్ని పలుమార్లు చాటింది. 2028 అసెంబ్లీ ఎన్నికలు సమీపించే నాటికి కాంగ్రెస్, BRS, BJP, మూడు పార్టీలకూ ఇదే అగ్ని పరీక్ష...అసలు పరీక్ష కానుంది

2023 ఎన్నికల తీర్పు దీనికి అద్దం పడుతోంది. కాంగ్రెస్ 39.69 శాతం, BRS 37.62 శాతం, BJP 14 శాతం ఓట్లు సాధించాయి. కాంగ్రెస్, BRS మధ్య ఓట్ల తేడా కేవలం 2.07 శాతం పాయింట్లు మాత్రమే. అయినా సీట్లలో కాంగ్రెస్ 64, BRS39, BJP8 స్థానాలు దక్కాయి. ఓట్లలో స్వల్ప మార్పు కూడా సీట్లలో భారీ రాజకీయ ప్రభావాన్ని చూపగలదన్నది ఈ ఫలితం చెప్పిన పాఠం.

2023లో మార్పు కోరుకున్న ఓటరు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించాడు. ఇప్పుడు అదే ఓటరు కాంగ్రెస్ పాలనను కొలవనున్నాడు. ఆరు గ్యారెంటీల అమలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళా పథకాలు, ఉచిత విద్యుత్, ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగాలు, ఇవన్నీ ప్రకటనలతో కాదు, ప్రజల అనుభవాలతోనే లెక్కకట్ట బడతాయి. పాలనలో పారదర్శకత, భూవ్యవహారాలు, బదిలీలు, కాంట్రాక్టులు, అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం అనుసరించే వైఖరి కూడా కీలకం. 2028లో కాంగ్రెస్‌కు BRS ఏంచేయలేదు? అన్న ప్రశ్న కంటే మేం ఏం చేశాం? అన్నదే ప్రధానం.

37.62 శాతం ఓటు BRSకు ఉన్న బలమైన రాజకీయ పునాదిని సూచిస్తోంది. అయితే ఓటమి తర్వాత కేడర్‌ను పునరుద్ధరించడం, నాయకత్వాన్ని సమన్వయం చేయడం, యువతలో కొత్త నమ్మకం కల్పించడం ఆ పార్టీ ముందున్న సవాళ్లు. గత పదేళ్ల పాలనను గుర్తుచేయడం మాత్రమే సరిపోదు. తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నదే ప్రజలకు చెప్పాలి. రైతులకు కొత్త విధానం, యువతకు ఉపాధి, నైపుణ్యాలు,అభివృద్ధి నమూనా, ఇవన్నింటిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ అవసరం. 2023లో 14 శాతం ఓట్లతో 8 స్థానాలు గెలుచుకున్న BJP రాష్ట్ర రాజకీయాల్లో తన స్థానం పెంచుకుంది. ఇప్పుడు ఆ ఓటు శాతాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడమే సవాలు. జాతీయ నాయకత్వ ప్రభావంతో పాటు తెలంగాణ సమస్యలపై నిరంతర పోరాటం, నియోజకవర్గ స్థాయిలో సంస్థాగత బలం, స్థానిక నాయకత్వం కీలకం.

కాంగ్రెస్,BRS మధ్య జరిగే రాజకీయ మార్పుల్లో BJPకి లభించే స్థలం ఎంత అన్నది 2028 నాటికి తేలుతుంది. మూడు పార్టీలకూ సందేశం ఒక్కటే, హామీల కంటే అమలు, ప్రచారం కంటే పనితీరు ముఖ్యం. ఓటరు పథకాలను స్వీకరించవచ్చు. హామీలను వినవచ్చు. కానీ చివరికి తన అనుభవం తోనే తీర్పు ఇస్తాడు. 2028లో డేంజర్ బెల్ ఎవరికి మోగుతుందో ముందే చెప్పలేం. కానీ ఆ గంట మోగించే అధికారం మాత్రం ప్రజల చేతిలోని ఓటులో ఉంది. అందుకే మూడు పార్టీలూ ఇప్పటి నుంచే తమను తాము ప్రశ్నించుకోవాలి, ప్రజలు మమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలి ? దానికి సమాధానం ప్రసంగాల్లో కాదు, పాలనలో, పనితీరులో, విశ్వసనీయతలో కనిపించాలి ఎందుకంటే తెలంగాణ ఓటరు మౌనంగా ఉంటాడు. కానీ ఎన్నికల రోజున ఆ మౌనం తీర్పుగా మారుతుంది.

**- కొలను వెంకటేశ్వర రెడ్డి**
రిటైర్డ్ ఎస్పీ జైళ్ల శాఖ

# విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

విశ్వ మంగళ మాంగళ్య విశ్వ విద్యా వినోదినే..
విశ్వ సంసార భీజాయ నమస్తే విశ్వ కర్మణే.
విశ్వాయ విశ్వ రూపాయ నమస్తే విశ్వ మూర్తియే..
విశ్వ మాత పితా రూప విశ్వకర్మ నమోస్తుతే.

సకల ప్రాణి కోటిని సృష్టించు జగత్పతి విశ్వకర్మ యొక్క ఆవిర్భావం ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన రూపమే విశ్వకర్మ. పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, పది చేతులతో స్వయంభువుగా అవతరించిన రూపంగా భావిస్తారు. విశ్వకర్మ ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, శుక్ల యజుర్వేదంలో సృష్టి కర్తగా పేర్కొన బడినాడు. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా వర్ణించ బడినాడు. పురుష సూక్తంలో విరాట్ పురుషుడుగా కీర్తించ బడినాడు. సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్త. వేదములు విశ్వకర్మను సర్వపాప సంహర్తగా పేర్కొనాయి. సర్వ దిక్కులను పరికించు దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు కనుకనే ఈయన భగవంతుడు అని ఋగ్వేదము ఈయనను భగవంతునిగా పరిగణించింది. మహా భారతము ఈయనను వేయికళలకు అధినేతగా అభివర్ణించింది. విశ్వకర్మ యొక్క పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలు ఉద్భవించారు, ఈ పంచ బ్రహ్మల నుండి వారి సంతతి అయిన ఐదుగురు (సనగ, సనాతన, అహభౌసన, ప్రత్నస, సుపర్ణస.) పంచార్షేయ బ్రాహ్మణులు (విశ్వ బ్రాహ్మణులు) ఉద్భవించారు. వీరి ద్వారా చేయు శాస్త్రం, వృత్తులు నిర్దేశింప బడినవి. వీటితో పాటు పౌరోహిత్యం కూడా వారి వృత్తులలో భాగమే. వృత్తి విద్యలు, నిర్మాణ, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు ఈయన అధిపతి. విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడు. దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి. దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పి. విశ్వకర్మ సమస్త హస్త కళలన్నింటికి ఆది దేవుడు, విశ్వము యొక్క ప్రధాన రూపశిల్పి. వెయ్యి హస్తకళ ఆకృతులకు కార్యనిర్వాహణాది కారి. నాలుగు యుగాలన్నింటి లోను ఆయన దేవతలకు అనేక పట్టణాలు మరియు రాజ భవనాలు నిర్మించి ఇచ్చిన స్థపతి, వాస్తు మరియు భవన శిల్పి. సత్య యుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్ర లోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణ లంకని ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినా పురాన్ని, ఇంద్రప్రస్థాన్ని నిర్మించిన అద్భుత శిల్పి.

శ్లో. నభూమి నజలం చైవ నతేజో నచ వాయవ: నచబ్రహ్మా నచవిష్ణు నచ రుద్రస్య తారకః



సర్వ శూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణ. (మూల స్తంభ పురాణం)...భూమి, నీరు, అగ్ని, వాయువు,ఆకాశము, మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర - ఇంద్ర -సూర్య - నక్షత్రములు పుట్టక ముందే విశ్వకర్మ తనంతట తాను స్వయంభు రూపమై అవతరించి నాడు.

శ్లో. పూర్వావనా త్సానగః దక్షణా త్సనాతనః; అపరా దహభూవః ఉద్వీచ్యాం ఉర్ధవాత్సుపర్ణః

విశ్వకర్మ పరాత్పరుని యొక్క తూర్పు ముఖమైన సద్యోజాతములో సానగ బ్రహ్మర్షి మను బ్రహ్మయు, దక్షిణ ముఖమైన వసుదేవములో సనాతన మహర్షి యను మయబ్రహ్మయు, పశ్చిమ ముఖమైన అఘోరియునందు అహభూవ మహర్షి యను త్వష్ట బ్రహ్మయు, ఉత్తర ముఖమైన తత్పురుషములో ప్రత్న మహర్షి యను శిల్పి బ్రహ్మయు, ఊర్ధ్వ ముఖమైన ఈశానములో సువర్ణ మహర్షియను విశ్వజ్ఞ బ్రహ్మయు ప్రభవించినట్లు చెప్పబడినది. ఋక్ వేదం లోని పదవ మండలం 81,82 సూక్తాలు విశ్వకర్మ యొక్క సృష్టి నిర్మాణ క్రమాన్ని వివరిస్తాయి. ఈ విశ్వకర్మల గురించి వేద, పురాణ, ఇతిహాసాలలో, ప్రాచీన సాహిత్యంలో,ఆధునిక సాహిత్యంలో వీరి గురించి ప్రస్తావించ బడినది. ఉదహరణకు ప్రజాకవి వేమన తన శతకంలో అంటాడు 'విశ్వకర్మ లేని విశ్వంబు లేదు' అని మరోక చోట 'విశ్వకర్మ దేవాది దేవుడు' అని ప్రస్తావించాడు. విశ్వకర్మ గురించి నన్నయాది ప్రాచీన కవులు ఎందరో ప్రస్తుతించారు. విశ్వ బ్రాహ్మణుల వృత్తుల ద్వార సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వీరిని ఈ సమాజంలో ఆచార్య, దైవజ్ఞ , ఆచారి అనే పేర్లతో పిలుస్తుంటారు. దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయువారు విశ్వకర్మలే. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన వీరు పూర్వం యంత్ర పరికరాలు రాక ముందు పనులన్ని మానవ శ్రమ తోనే ముడిపడి ఉండేవి. లోకంలో మానవ జీవనానికి విశ్వకర్మీయుల కులవృత్తులు ప్రధాన ఆధారంగా ఉండేవి, ఉన్నాయి.ఈ విశ్వకర్మ కులంలో జన్మించిన శ్రీమద్వి విరాట్ శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కులవృత్తులను చేస్తూనే కాల జ్ఞానాన్ని చెప్పాడు. నిష్టాగరిష్టులైన ఈ విశ్వ బ్రాహ్మణులు కుల వృత్తులనే కాక జ్యోతిష, పౌరోహిత, యంత్ర, గృహవాస్తు నిర్మాతలుగా, విద్యా వేత్తలుగా, వైద్యులుగా, ప్రకృతి వైద్యులుగా, శాసన లేఖకులుగా అన్ని రంగాలలో, నాటి నుండి నేటి వరకు సకల కళల యందు ప్రావీణ్యతను నిరూపిస్తూ ఈ విశ్వం నందు నిష్ణాతులై విరాజిల్లుతున్నారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# గణేష్ లడ్డు దక్కించుకున్న ఉచ్చిల రవికుమార్

రూ.32,001కు లడ్డూ ప్రసాదం సొంతం



కాట్రేనికోన౦సెప్టెంబర్౦23 మనం ప్రతినిధి : మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, కీసర మండలం నాగారం విలేజ్ వివేకానందనగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా౦నిర్వహించిన లడ్డూ వేలం పాటలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్సీపీ మేధావుల విభాగం కార్యదర్శి ఉచ్చిల రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కాలనీ వాసుల మధ్య పోటాపోటీగా సాగిన లడ్డూ వేలం పాటలో ఉచ్చిల రవికుమార్ రూ.32,001లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. భక్తి విశ్వాసాలతో గణేష్ ప్రసాదాన్ని సొంతం చేసుకోవడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉచ్చిల రవికుమార్౦ఉచ్చిల జ్ఞానవతి, కుమారులు ఉచ్చిల ప్రశాంత్ , ఉచ్చిల వినయ్ , జీహెచ్ఎంసీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీహరి, శ్యామ్సన్, మల్లికార్జున్, శిరీష, యాకోబు, డి రవికుమార్,సంతోష్,రాజు, నాగయ్య, కృష్ణ, వెంకటరావు, గణేష్,సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రమణయ్యపేట బాల వినాయకుడి నిమజ్జనం



కిర్లంపూడి సెప్టెంబర్ 23:( మనం న్యూస్) : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో దొడ్డి ముసలయ్య ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన బాల వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించిన అనంతరం బాల వినాయకుడిని గ్రామ పురవీధుల్లో తీన్మార్ డప్పులు,నృత్యాలు,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు.అనంతరం ఏలేరు నది తీరానికి చేరుకుని బాల వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బాల వినాయకుడి కృపాకటాక్షాలతో పాటు గ్రామ ప్రజల సహాయ సహకారాలతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దొడ్డి సత్తిబాబు, దొడ్డి శివాజీ, దొడ్డి శ్రీను, తుమ్మల సుబ్బు, కర్రి లోవబాబు, ఆళ్ల వెంకన్నబాబు, ఆడారి లోవబాబు, దాడి రమణబాబు, దాడి ప్రకాష్, దొడ్డి శివ, దొడ్డి ఏసుబాబు, మద్దాల శివ, రాపేటి రమేష్, దొడ్డి స్వామి, చిట్టినీడి ఏసుబాబు, సింగులూరి రాజు, సింగులూరి చిన్ని, ఈగల నాగేశ్వరరావు, ఇసరపు రాంబాబు, ఆడారి కార్తీక్, పెంటకోట సాయి, కర్రి వరబాబు, దొడ్డి పవన్, తుమ్మల శ్రీ చైతన్య అభిలాష్, దొడ్డి యస్వంత్తో పాటు బాల వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గణనాథుడికి ఘన వీడ్కోలు

ఉప్పాడ సముద్ర తీరంలో కొనసాగుతున్న గణపతి నిమజ్జనాలు



యు.కొత్తపల్లి సెప్టెంబర్ 23 ( మనం న్యూస్): గణపతి నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడికి పదో రోజు ఘన వీడ్కోలు పలికారు.మండలంతో పాటు పిఠాపురం నియోజకవర్గం, కాకినాడ పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గణపతి విగ్రహాలను ఉప్పాడ సముద్ర తీరానికి తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు.సుబ్బంపేట, మూలపేట, కోనపాపేట ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేకంగా నిమజ్జన ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే గ్రామాల్లో గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లిన భక్తులు.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉప్పాడ సముద్ర తీరానికి చేరుకున్నారు.డీజే పాటలు, బాణాసంచా, యువత కేరింతల మధ్య 'గణపతి బప్పా మోరియా' అంటూ గణనాథుడిని ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు. భారీ వర్షం కురుస్తున్నా, సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నా భక్తులు లెక్కచేయకుండా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ, , కత్తిపూడి తదితర ప్రాంతాల నుంచి కూడా గణపతి విగ్రహాలను ఉప్పాడ తీరానికి తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు. వర్షం, తుపాను ప్రభావిత వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా నిమజ్జనాలు కొనసాగుతున్నాయి.

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పిఠాపురం సీఐ, యు.కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు, సిబ్బంది పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సముద్ర తీరంలో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.

# ప్రహరీ గోడ ఆర్చి నిర్మాణం కొరకు భూమిపూజ

కాట్రేనికోన సెప్టెంబర్౦23 మనం ప్రతినిధి: సేవా మిత్రా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాట్రేనికోన౦జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990 బ్యాచ్, హైస్కూల్ ప్రహరీ గోడ ఆర్చి నిర్మించుట కొరకు భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు౦దాకమారి నాగ మనేశ్వరరావు,



అధ్యక్షులు కె. పెద్దిరాజు, జె.దుర్గా ప్రసాద్,వెంట్రు ప్రసాద్,కోలా త్రిమూర్తులు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒరిగల జగపతి,ఎలిపే వెంకటేశ్వరరావు, తంబి,కోటిపల్లి సత్యనారాయణ, కాట్రూ అప్పారావు,చెరుకు గుప్తా,పాలగుమ్మి రాంబాబు,మంగం శ్యామ్ సుందర్, చింతా వేణుగోపాల్,చెల్లూరి రాజబాబు, వట్టూరి బాబీ,బొమ్మిడి రాంబాబు,పాఠశాల౦ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

- అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



విశాఖపట్నం, సెప్టెంబర్ 23 : 2026-27 ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ధాన్యం కొనుగోలు, సేకరణకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ క్రమంలో జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సుమారు 2,278 హెక్టార్లలో వరి సాగు చేశారని, సుమారు 11,600 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి చంద్రారావు జేసీకి వివరించారు. నవంబర్ రెండో వారం నుంచి ధాన్యం దిగుబడి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సేకరణ, రవాణా తదితర అంశాలపై ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని జేసీ సూచించారు.

రైతులతో ముందుగానే సంప్రదించి, అవసరాన్ని బట్టి క్లస్టర్లను విభజించాలని జేసీ ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరులోగా క్లస్టర్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు తగిన రవాణా సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ-పంట, ఈ-కేవైసీ ప్రక్రియలో ఉన్న పెండింగ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత, తేమ శాతాన్ని పరిశీలించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

# ఏబీసీ అధికారుల దాడులు

- లంచం తీసుకుంటూ దొరికిన జిల్లా రెవెన్యూ అధికారి



విశాఖ, సెప్టెంబర్ 23 : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అవినీతి నిరోధక శాఖ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. రూ. 50,000 లంచం తీసుకుంటూ జిల్లా రెవెన్యూ అధికారి (ఝు మారోతు వేంకట సూర్య లోకేశ్వరరావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారు.

పూర్తి వివరాల్లోకి వెళ్తే... పాడేరు కలెక్టరేట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న అమ్ము సూర్య చక్రవర్తి అనే ఉద్యోగికి సంబంధించిన రెగ్యులర్ పే స్కేల్ క్రమబద్ధీకరణ మరియు 2024 వరకు పెండింగ్లో ఉన్న వార్షిక ఇంక్రిమెంట్ల మంజూరు కోసం ఝ లోకేశ్వరరావు రూ. 50,000 లంచం డిమాండ్ చేశారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు విశాఖపట్నం రేంజ్ ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. బుధవారం సాయంత్రం పాడేరు ఝ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ. 50,000 లంచం తీసుకుంటుండగా అధికారులు లోకేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన అధికారి లోకేశ్వరరావు 2005లో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్గా ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత రెవెన్యూ శాఖలోకి వచ్చి డిప్యూటీ కలెక్టర్గా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతులు పొంది ప్రస్తుతం ఝగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064 లేదా 9440440057 కి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



# వైఎస్ జగన్ను కలిసిన ఆల్ఫా కృష్ణ

విశాఖ, సెప్టెంబర్ 23 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విశాఖ జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి, వైసిపి సీనియర్ నాయకులు ఆల్ఫా కృష్ణ బుధవారం కలిశారు. తాడేపల్లిలో జరిగిన విశాఖ వైసీపీ నేతల సమావేశంలో భాగంగా ఆయన జగన్ను వ్యక్తిగతంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా విశాఖలో పార్టీ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై జగన్తో సుదీర్ఘంగా చర్చించారు. విశాఖలో పార్టీని తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని జగన్ ఈ సందర్భంగా ఆల్ఫా కృష్ణకు సూచించారు. పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తామని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని ఆల్ఫా కృష్ణ పార్టీ అధినేతకు హామీ ఇచ్చారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్గా పనిచేసిన ఆల్ఫా కృష్ణ విశాఖలో వైసీపీకి బలమైన నేతగా గుర్తింపు పొందారు.

# భోగాపురంలో విస్తృతం అవుతున్న విమానయాన సేవలు



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాఖ, సెప్టెంబర్ 23 : భోగాపురం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్ నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనుండటం సంతోషకరంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఢిల్లీ ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు, ప్రయాణికులకు మరింత ఎంపిక, సౌకర్యాన్ని ఈ కొత్త విమాన సర్వీసు అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అక్టోబర్ 25వ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రారంభం కానుండగా.. ఉదయం 5:55 కు ఢిల్లీ లో ప్రారంభమై.. 8:20 కి భోగాపురం చేరుకోనుంది. మళ్ళీ భోగాపురంలో 09:05 నిమిషాలకు ప్రారంభమై.. 11:30 కు ఢిల్లీ చేరుకుంటుంది.

భోగాపురం విమానాశ్రయం ద్వారా దేశంలోని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ మరింత విస్తరించడంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమానయాన రంగం, పర్యాటకం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ముఖ్యంగా మూడు సంవత్సరాల విరామం తర్వాత ఆకాశ ఎయిర్ తిరిగి విశాఖపట్నం ప్రాంతంలో తన విమాన సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం అభివృద్ధితో ఉత్తరాంధ్రను దేశంలోని వివిధ ప్రాంతాలతో మెరుగైన వైమానిక కనెక్టివిటీతో అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా విమాన సర్వీసులు, గమ్యస్థానాల సంఖ్యను మరింత పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# తుపాను ఎఫెక్ట్.. రేపు పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సెలవు ప్రకటించిన ఇంచార్జి కలెక్టర్

పోలవరం జిల్లా(చింతూరు, మనం న్యూస్) సెప్టెంబర్ 23: తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో పోలవరం జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 24న అన్ని



పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు.

విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించరాదని స్పష్టం చేశారు.

భారీ వర్షాలు, వరదల అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు పాటించాలని ఇదే సందర్భంలో లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ కూడా అప్రమత్తతో ఉండాలని తెలియజేశారు.

# ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా నాచు పెంపకం

డీఆర్డీఏ కాకినాడ పీడీ శ్రీనివాస్



యు.కొత్తపల్లి సెప్టెంబర్ 23 ( మనం న్యూస్) : మత్స్యకార మహిళలకు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా సముద్ర నాచు పెంపకం ఉపయోగపడుతుందని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం అమినాబాద్లో సెర్ప్, వెలుగు, సీఎస్ఎం సీఆర్ఐ, మత్స్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు సముద్ర నాచు పెంపకంపై ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో దీనిని ప్రయోగాత్మకంగా చేపడుతున్నామని, దీని ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందేందుకు వీలుంటుందన్నారు. బాపట్ల జిల్లాలో ఈ పథకం విజయవంతంగా నడుస్తోందన్నారు. సముద్ర నాచుకు దేశ విదేశాల్లో మంచి గిరాకీ ఉందన్నారు.ఉత్పత్తయిన నాచును శిక్షణ ఇస్తున్న సీఎస్ఎం సీఆర్ఐ సంస్థ కొంటున్నందున మార్కెటింగ్ ఇబ్బందులు ఉండవన్నారు. సైంటిస్ట్ సతీష్ నాచు పెంపకంపై శిక్షణ ఇచ్చారు. బాపట్ల నుంచి తెచ్చిన విత్తనాన్ని ట్యూబుల మధ్యన వలలు అనుసంధానించి విత్తనాన్ని పెంచే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. పంట కాలం 45 రోజులు ఉంటుందన్నారు.కార్యక్రమంలో డీపీఎం బాబూరావు, ప్రశాంత్, ఏపీఎం ప్రశాంతి, తవుడు తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన


కాట్రేనికోన సెప్టెంబర్౦23 మనం౦ప్రతినిధి : మండల కేంద్రమైన కాట్రేనికోనలోని ఓల్ అయినాపురం డ్రైన్ వద్ద ఏకలవ్య విగ్రహం పెట్టుకొనుటకు ఎస్టీ సంఘం తరుపున జిల్లా కలెక్టర్ కు అనుమతి నిమిత్తం దరఖాస్తు చేశారు. దీంతో అమలాపురం ఆర్డీవోసరళావతి, డి.ఎస్.పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్తో సహా మరో 11 వివిధ శాఖలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు బుధవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాట్రేనికోనలోని విగ్రహ ఏర్పాటు ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు విషయమై పూర్తిస్థాయి నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేస్తామని కమిటీ సభ్యుల్లో ఒకరు తెలిపారు. కార్యక్రమం లో ఆర్ అండ్ బి డి ఈ, బి వి ఎస్ వర్మ,ముమ్మిడివరం ఎలక్ట్రికల్౦డి ఈ, ఏఈ నీలయ్య , తహసిల్దార్ రవి కిరణ్ ఎంపీడీవో బి రాజేశ్వర్ రావు ,ముమ్మిడివరం సి ఐ మోహన్ కుమార్, ఎస్ ఐ వి సత్యనారాయణ పంచాయతీ సెక్రెటరీ జే వి వి సత్యనారాయణ,డ్రైనేజీ విభాగం నుండి ఈఈ, పంచాయతీరాజ్ నుండిడి ఈ , ఎస్టీ సంఘం నుండి౦ఏ భోగి రాజు, ఎంఅరుణ్ కుమార్, ఏ ప్రసాద్, కే నాని తదితరులు పాల్గొన్నారు.



# జనసేనలోకి వరుపుల సుబ్బారావు..

మండపంలో హర్షాతిరేకాలు..

శంఖవరం సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి: ప్రత్తిపాడు: జనసేన పార్టీలో ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు వరుపుల సుబ్బారావు చేరిన సందర్భంగా మండపం గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా మండపం గ్రామ జనసేన నాయకులు పోలం వెంకటరత్నం, పోలం పద్మ (విష్ణుమూర్తి) ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు సుంకర వెంకట సూరి, మానుకొండ నూకరాజు, చాగంటి అప్పారావు, వేల్పుల నాగబాబు, గుండిబిల్లి నూకరాజు, సుంకర నూకరాజు తదితరులు జనసేన నేత వరుపుల సుబ్బారావు ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పూలదండలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండపం గ్రామ జనసేన నాయకులు పోలం వెంకటరత్నం మాట్లాడుతూ, వరుపుల సుబ్బారావు జనసేనలో చేరడంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేస్తాయని తెలిపారు.

ప్రజా సేవ, అభివృద్ధి, నిస్వార్థ రాజకీయాలే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకు సాగుతోందని, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.



# శంఖవరం మండలంలో వినాయక నిమజ్జనాల సందడి..

**శంఖవరం, సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి:** వినాయక చవితి ఉత్సవాల అనంతరం శంఖవరం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు సందడిగా కొనసాగుతున్నాయి. భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథుడి విగ్రహాలను ఊరేగింపుగా తరలిస్తూ భక్తిశ్రద్ధలు చాటుకుంటున్నారు.

శంఖవరం-కత్తిపూడి ప్రధాన రహదారిపై సాగిన ఓ నిమజ్జన ఊరేగింపు దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరటి ఆకులు, పూలమాలలు, రంగురంగుల బెలూన్లతో అలంకరించిన ట్రాక్టర్ భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. రహదారిపై వర్షం కురుస్తున్నప్పటికీ ఉత్సాహంగా నిమజ్జన యాత్ర కొనసాగింది.

ఊరేగింపుతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు కూడా కొంత నెమ్మదించాయి. ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు నిమజ్జన ఊరేగింపునకు అనుగుణంగా ముందుకు సాగారు. మండలంలో శంఖవరం పలు ప్రాంతాల్లో యువత, భక్తులు పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని నెలకొల్పారు.

# విజయవాడలో అక్టోబర్ 19న బిఎస్ఐ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు


- బిఎస్ఐ రాష్ట్ర కోశాధికారి పాలుమూరి శామ్యూల్
- పెనుమంట్ర మండలంలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అవగాహన సదస్సు



ఆచంట సెప్టెంబర్ 23 మనం న్యూస్ : ఆచంట నియోజకవర్గ పరిధిలోని పెనుమంట్ర మండలంలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా పెనుమంట్ర శాఖ ఏర్పాటుపైంమండలంలోని నెగ్గిపూడి గ్రామం చించినాడ కాలువ గట్టు వద్ద ఉన్న నూతన యేరూషలేము ప్రార్థన మందిరము నందు పాస్టర్ ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఉదయం క్రైస్తవ నాయకులు గుత్తుల సాల్మన్ దొర ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఎస్ఐ ఏపీ రాష్ట్ర కోశాధికారి పాస్టర్ పాలుమూరి శామ్యూల్,బిఎస్ఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు మామిడిశెట్టి కరుణాకర్,రాష్ట్ర చర్చ్ రిలేటెడ్ సభ్యులు జాన్సన్ పాల్గొన్నారు.పాస్టర్ పాలుమూరి శామ్యూల్ మాట్లాడుతూ బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా విశిష్టతను వివరించారు. బిఎస్ఐ భారతదేశంలో బైబిల్ లను అనువదించడానికి, ముద్రించడానికి మరియు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేయబడిన ప్రముఖ క్రైస్తవ సంస్థ అన్నారు. ఇది 21వ తేదీ ఫిబ్రవరి 1811 సంవత్సరం నుండి భారత దేశంలో బెంగళూరు ప్రధాన కేంద్ర కార్యాలయంగా ఉందన్నారు. ఇది ఇండియా బైబిల్ సొసైటీ ట్రస్ట్ అసోసియేషన్(ఐఆఖీఖీఅ) ప్రధానంగా యునైటెడ్ బైబిల్ సొసైటీస్(ఆఖీ) కి అనుబంధంగా ఉందన్నారు. ప్రస్తుతం పరిశుద్ధ గ్రంథము 74 భారతీయ భాషలలో, నూతన నిబంధన 92 ప్రాంతీయ భాషలలో, 15 భారతీయంబ్రెయిలీ లిపి భాషలలో, స్క్రిప్చర్ పోర్షన్స్ 48 భాషలలో అనువదించబడినది.సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో చౌకైన ధరలో మరియు సులభంగా అందుబాటులో ఉండే విధంగా ఆధ్యాత్మికమైన దేవుని వాక్యాన్ని వివిధ భారతీయ భాషలో అందించడం, అలాగే క్రొత్త నిబంధన పుస్తకాలు బ్రెయిలీ బైబిల్ లో చిన్నపిల్లల కోసం ప్రత్యేక భాగాలను ప్రచురిస్తుందన్నారు. తెలుగు బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆక్సిలరీ ఏర్పడి 75 సంవత్సరాలు సందర్భంగా అక్టోబర్ 19వ తేదీ విజయవాడ కన్వెన్షన్ లో జరగనున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకురాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బిఎస్ఐ సభ్యులు హాజరు కావాలని కోరారు.బిఎస్ఐ అభివృద్ధికి క్రైస్తవులందరూ తోడ్పడాలని పాస్టర్ శామ్యూల్ పాలుమూరి పిలుపునిచ్చారు. పాస్టర్ సత్తి ప్రభాకర్ రెడ్డి, గుత్తుల సాల్మన్ దొర,ఎం.ప్రతాప్ కుమార్, ఎం.మురళి,శీలం జ్యోతిబాబు, జి.జే.విక్టర్, వై.డేవిడ్, పి.రాజేష్, ఎం.ఎలీషా, పి.మార్గరెట్ రోజి, రాజ్ కుమార్, కే.డేవిడ్, టి.యేసురత్నం, సిహెచ్. స్టీఫెన్ పాస్టర్లు శ్యాం బాబు, పెసల చిరంజీవి,నక్కా క్రీస్తుదాసు, పి.ప్రేమకుమార్, పి.శామ్యూల్ రాజ్, పి.ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల, ఇతర పింఛన్ దారుల కుటుంబంలో పొరబాటున కలిసిన అర్హులు అందరికీ పింఛన్లు ఇవ్వాలి

**పాలకొల్లు, సెప్టెంబర్ 23,మనం ప్రతినిధి :** నిరుపేద కుటుంబానికి చెంది, అన్ని అర్హతలు కలిగి ఉన్న సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అందరికీ నూటికి నూరు శాతం సంతృప్తి పొందేలా, తద్వారా కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా సామాజిక పింఛన్లు ఇవ్వాలని ఆ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి మంత్రి లోకేష్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అన్ని విధాల అర్హులైనప్పటికీ కొందరి పేర్లు ఇప్పటికే పింఛన్ పొందుతున్న వారి



కుటుంబంలోనూ, మరికొందరి పేర్లు వివాహం చేసుకుని వెళ్లిపోయిన కుమార్తె, ఆమె భర్త ఉద్యోగి అయితే ఆ కుటుంబంలోనూ కలిసిపోవడంతో కొందరికి పింఛన్లు అందకుండా అన్యాయం జరుగుతుంది. కొడుకు ఉద్యోగి అయితే అనర్హత చేసిన తప్పులేదు గాని, ఒక నిరుపేద కుటుంబం ను ఉద్యోగులైన కోడలు లేక అల్లుడు కుటుంబంలో కలిపి పొరపాటున ఒకే కుటుంబంగా హౌస్ హోల్ మ్యాపింగ్ చేయడంతో నిరుపేద కుటుంబం కూడా పింఛన్ పొందలేక అనర్హుల జాబితాలో చేరిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పొరపాట్లుంకారణంగా ఏపీలో వేలాదిమంది నిజమైన సామాజిక పింఛన్ల దరఖాస్తుదారులు అర్హులైనప్పటికీ న్యాయం జరగటం లేదని అంటున్నారు, ఇలాంటి పొరపాట్లను సరిచేసి నిజమైన లబ్ధిదారులను ఎంపీడీవోల ద్వారా ఎంపిక చేయాలి కానీ, హౌస్ హోల్ మ్యాపింగ్ తో ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నాయని అందువల్ల మ్యాపింగ్ చేయొద్దని చెప్పడం ఎంత మాత్రం సమంజసం కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి కేసులలో ఎంపీడీవో ద్వారా అయినా ఎంపిక చేస్తే నిజమైన వాస్తవ లబ్ధిదారులు ఎంపిక అవుతారని దరఖాస్తులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం లో ఇలాంటి అర్హులైన వారిని అవసరమైతే హౌస్ హోల్ మ్యాపింగ్ చేసి మరి న్యాయం చేసే వారిని, కూటమి ప్రభుత్వం కూడా లబ్దిదారులకు మేలు జరిగేలాఅలాంటి సౌకర్యం కల్పించడం చేయాలి లేదంటే నేరుగా లబ్ధిదారుల సొంత పూచికత్తు పై లెటర్ ద్వారా పింఛన్ పొందేందుకు అర్హత కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు పంపుతున్న వారికి ఈ దఫాలో అవకాశం కల్పించి, దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి మళ్లీ అవకాశం కల్పించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి మంత్రి లోకేష్ లను కోరుతున్నారు.



# తీరప్రాంత గ్రామాలలో పర్యటించిన తాసిల్దార్

**నరసాపురం, సెప్టెంబర్ 23 (మనం న్యూస్) :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నరసాపురం మండలంలోని వేములదీవి, బియ్యపుతిప్ప, పెదమైనవానిలంక గ్రామాలలోని సముద్ర తీర ప్రాంతాలలో బుధవారం నరసాపురం తాసిల్దార్ నాగార్జున పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల నేపథ్యంలో కిందిస్థాయి సిబ్బంది హెడ్ క్వార్టర్లో అందుబాటులో ఉండాలని చెట్లు, కరెంటు స్తంభాలు కూలడం, వర్షపు నీరు చేరడం వంటి సంఘటనలపై తక్షణం స్పందించాలని అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వ పాఠశాలలు, తుఫాను షెల్టర్లకు తరలించాలని వారికి ఆహార సదుపాయాలను కల్పించాలని తాసిల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

# స్థానిక ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులను గెలిపించండి

- రైతు, ప్రజా సమస్యల పోరాట నాయకుడు కూనపరెడ్డి రంగారావు



**నరసాపురం, సెప్టెంబర్ 23 (మనం న్యూస్) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రైతు, ప్రజా సమస్యల పోరాట నాయకుడు, యర్రంశెట్టివారి పాలెం గ్రామ మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీరవెంకట విజయ రంగారావు పిలుపునిచ్చారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో నరసాపురం నియోజకవర్గానికి అన్యాయం జరిగిందని న్యాయపరంగా నరసాపురంను జిల్లా కేంద్రంగా చేయాల్సి ఉండగా రాజకీయ నాయకుల కారణంగా భీమవరంను జిల్లాకేంద్రం చేయడంతో నరసాపురం ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని రంగారావు ఆరోపించారు. స్థానిక రుస్తుంబాద నత్తల మురుగు కాలువ ఆక్రమణలకు గురైన కారణంగా సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆక్వా మేతల ధరల పెంపు, రొయ్య ధరల తగ్గింపు కారణంగా రైతులు అప్పుల పాలవుతున్నారని మొగల్తూరు రోడ్ నుండి వేములదీవి వెళ్లే కాలువలో మునిసిపల్ డ్రైనేజీ నీరు, ప్రభుత్వాసుపత్రి వ్యర్థాలు కలుస్తుండడంతో నరసాపురం మండలం మొత్తం ప్రజలు ఈ కలుషిత నీటిని త్రాగి అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకొనే నాధుడే లేడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాపులకు ఐదు సంవత్సరాలలో 15 వేల కోట్లు నిధులు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత రెండు సంవత్సరాలలో 6 వేల కోట్ల రూపాయల నిధులు నేటికీ విడుదల చేయలేదని ఆయా సమస్యలపై పాలకులు, నాయకులు చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఆయా సమస్యలు పూర్తి పరిష్కారం కావాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకొని అభివృద్ధిని సాధించుకుందామని రంగారావు పిలుపునిచ్చారు.

# నులిపురుగుల నివారణకు శాఖల సమన్వయంతో కార్యాచరణ

**పోడూరు, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధి:** నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలు మింగించాలని పోడూరు మండల పరిషత్ అధికారి బి.ఎల్. మంగకుమారి తెలిపారు. పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్. శ్రీ వాసవి



ఆధ్వర్యంలో నిర్వహించిన శాఖల సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాశాఖ, అంగన్వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వైద్యాధికారి ఎస్. శ్రీ వాసవి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసే విషయాన్ని ముందురోజే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని, మాత్రలు వేసే రోజున పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులకు అవగాహన కల్పించి మధ్యాహ్న భోజనం అనంతరం అల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. చేతుల పరిశుభ్రతపై సిబ్బంది విద్యార్థులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలోమండల టిడిపి అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, టిడిపి సీనియర్ నాయకులు కొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఎంపిటీసీ మానేపల్లి శ్రీధర్, మాజీ ఎంపీపీ, వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ పెనుమత్స రామభద్ర రాజు, మండల విద్యాశాఖ అధికారి-2 జి.వి. సూర్యనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.బి.కె.ఎస్. రమేష్రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జె. సత్యనారాయణ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# లారీ రాకపోకలతో శంఖవరం ఉక్కిరిబిక్కిరి

- బైపాస్ రోడ్డు నిర్మాణమే శాశ్వత పరిష్కారమంటున్న గ్రామస్థులు
- 25 నుంచి ఐదు రోజుల పాటు రిలే నిరాహారదీక్షలకు గ్రామ అభివృద్ధి సేవా సంఘం సిద్ధం



**శంఖవరం, సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి:** శంఖవరం గ్రామం మీదుగా భారీ లారీల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని, గ్రామానికి ప్రత్యేకంగా బైపాస్ రోడ్డు నిర్మించాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో గ్రామ ప్రజల తరఫున దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సంఘం నిర్ణయించింది. ఈ మేరకు మండల కేంద్రమైన శంఖవరం నూకాలమ్మ తల్లి ఆలయ సమీపంలో శంఖవరం గ్రామ సేవా సంఘం సభ్యులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఉపాధ్యక్షులు గునపర్తి అపురూప్, ప్రధాన కార్యదర్శి పర్వత రామకృష్ణ మాట్లాడుతూ, శంఖవరం గ్రామం మీదుగా వెళ్లే ఆర్అండ్బీ ప్రధాన రహదారి స్థానిక రాకపోకలతో పాటు భారీ వాహనాల రాకపోకలకు కూడా వినియోగంలో ఉందని, ముఖ్యంగా లారీల రాకపోకలు పెరగడంతో గ్రామంలోని ప్రధాన రహదారిపై రద్దీ ఏర్పడటంతో పాటు స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద భారీ వాహనాల రాకపోకల కారణంగా సాధారణ రవాణా వ్యవస్థపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.

# ఆరాబ్ తుఫాన్ తాకిడిలో నిరాహార దీక్ష చేపట్టిన వీఆర్ఏలు

## స్పందించని కూటమి ప్రభుత్వం

**ఆచంట సెప్టెంబర్ 23 మనం న్యూస్:** బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా ఆర్నాబ్ తుఫాన్ ఏర్పడడం వల్ల ఎడతెరిపి లేని భారీ వర్షం మరియు ఈదురు గాలులు వీస్తున్నప్పటికీ లెక్కచేయకుండా గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు ఎనిమిదవ రోజు బుధవారం స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా ఆచంట మండల వీఆర్ఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు తలుపురి



ముత్యాలరావు సిరికొండ సాయి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల కాలంగా రెవెన్యూ శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ తమకు తగిన జీతభత్యాలు అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎనిమిదవ రోజు భారీ వర్షాన్ని ఈదురు గాలులను సైతం లెక్కచేయకుండా కనీసం టెంట్ వేసుకునేందుకు డబ్బులు లేక అరకొరగా బరకం ఏర్పాటు చేసుకొని వర్షంలో తడుస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేయాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని వాపోయారు అయినప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యు పెద్ద రెడ్డియ్య వెంకటరావు సత్యనారాయణ అమ్మిరెడ్డి పద్మారావు నాగేశ్వరరావు తదితరులు రిలే నిరాహార దీక్షంకార్యక్రమంలో పాల్గొన్నారు.

# మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం పెట్టాలి

## తాసిల్దార్ ఫాజిల్


**పోడూరు, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని పోడూరు మండల తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ సూచించారు.పోడూరు మండలంలోని గుమ్మలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని స్వయంగా తిని పరిశీలించారు. మెనూ ప్రకారం



విద్యార్థులకు మిశ్రమ కూరగాయల కూర, ఉడకబెట్టిన కోడిగుడ్డు అందించాల్సి ఉండగా, ఎగ్ ఫ్రైడ్ రైస్ వడ్డించడాన్ని తహసీల్దార్ గుర్తించారు. అంతేకాకుండా భోజనం రుచికరంగా లేకపోవడంపై మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, ఉపాధ్యాయులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇకపై మెనూలో పేర్కొన్న విధంగానే భోజనం వండి వడ్డించాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని సూచించారు. భోజన పదార్థాలు నాణ్యంగా, రుచికరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థులకు నాసిరకం భోజనం అందిస్తే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘన వీడ్కోలు

**పెంటపాడు సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన యువనేతంబొలిశెట్టి రాజేష్ంహాజరై ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మితో పాటు ఎంపీటీసీలు తమ పదవీకాలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేసిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులుగా



సేవలందించే అవకాశం కల్పించిన ప్రజలకు, సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.మండల పరిషత్ పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజా సేవలో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ, ప్రజాప్రతినిధుల సేవలను పలువురు అభినందించారు. పొట్ల ఏడుకొండలు ,ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ఎంపీటీసీలు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ చిత్రాలేఖనం పోటీలు

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పిఎం శ్రీ సేవ సంకల్ప అభియాన్ చిత్ర లేఖనం పోటీలు ప్రధాన ఉపాధ్యాయులు ఏం. సత్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు., విద్యార్థులకు చిత్రాలేఖనం పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి హాజరయ్యారు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట తాతాజీ , జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ , ఓబిసి మోర్చా రాష్ట్రంకార్యవర్గ సభ్యులు మారిసెట్టి నరసింహమూర్తి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా



మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తుట్టగుంట కృష్ణ కుమారి,పట్టణ యువమోర్చా అధ్యక్షులుంరాజా,ంఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు, చిత్రలేఖం పరిశీలించి వారిని అభినందించారు.వారికి పెన్నులు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మవాటూరు, నాగళూరు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్



- రీ-సర్వే పనుల వేగవంతానికి ఆదేశాలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పెనుకొండ సెప్టెంబర్ 23 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ పెనుకొండ డివిజన్ పరిధిలోని మవాటూరు మరియు నాగళూరు గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు.

ఈ తనిఖీలో భాగంగా రీ-సర్వేలో ఎదురవుతున్న ఉమ్మడి ఎల్పీఎంల విభజన పనుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరి స్థలానికి స్పష్టమైన హద్దులు నిశ్చయించి, డిజిటల్ రికార్డులను పక్కాగా సవరించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా జాయింట్ కలెక్టర్ స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. రీ-సర్వే సమయంలో భూమి హక్కులు, ఖాతాల విభజనలో ఎదుర్కొంటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి మరియు సరిహద్దు వివాదాలు త్వరగా పరిష్కారం కావడానికి రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అనంతరం క్షేత్రస్థాయి రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమావేశమై జాయింట్ ఎల్పీఎం ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి తగిన సూచనలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో పెనుకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆనంద్ కుమార్ , పెనుకొండ తహశీల్దార్ స్వాతి , గ్రామ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అధికారులు మరియు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు వేగం పెంచాలి

- నిర్ణీత కాలవ్యవధిలో అనుమతులు మంజూరు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



**పుట్టపర్తి, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** జిల్లాలో పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేసి, పెట్టుబడిదారులకు నిర్ణీత కాలవ్యవధిలో అన్ని రకాల అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్లోని చిన్న సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై సమావేశంలో సమీక్షించారు.జిల్లాలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సర్వేలు పూర్తి చేసుకున్న పరిశ్రమలతో పాటు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా కుదిరిన ఒప్పందాల పురోగతిని కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో పారిశ్రామిక ప్రగతిపై తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్న సంస్థలు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులను త్వరితగతిన ప్రారంభించి ఉత్పత్తి దశకు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే నిరుద్యోగులు, పారిశ్రామికవేత్తలు చేసుకునే దరఖాస్తులను పెండింగ్లో ఉంచరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలోనే సంబంధిత శాఖల అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమం కింద అర్హత సాధించిన ఎనిమిది పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ ప్రోత్సాహకాలు మంజూరు చేసేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు.జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో రూపొందించిన అభివృద్ధి కార్యక్రమం కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 30న పుట్టపర్తిలోని సాయి తేజ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేసి, జిల్లాలోని యువతకు పారిశ్రామిక అవకాశాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ప్రధాన అధికారి జె. నాగరాజ్, పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ప్రాంతీయ అధికారి పి. నాగభూషణ్, ప్రధాన బ్యాంకు అధికారి, జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పురపాలక శాఖ నోడల్ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ ఇంజినీర్ తదితర అధికారులు పాల్గొన్నారు

## నిమజ్జన వేడుకలకు పటిష్ట భద్రతా చర్యలు



**గోరంట్ల, సెప్టెంబర్ 23, మనం న్యూస్:** వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతను పర్యవేక్షించిన గోరంట్ల సీఐ బోయ శేఖర్ను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గోరంట్ల మండల పరిధిలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు తీసుకున్న చర్యలను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న వినాయకుని నిమజ్జనం సందర్భంగా సీఐ బోయ శేఖర్కు పూలమాలలు, శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. పండుగ వేడుకలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు తీసుకున్న జాగ్రత్తలు అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా, నంద గోపాల్, సుకుమార్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకొని పూర్తి స్థాయిలో పంటల సాగు చేపట్టాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో (ప్రైమరీ సెక్టార్) పై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న కొర్రలు, జొన్నలు, ఉలవలు, అలసందలు, పెసలు లాంటి ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకొని పూర్తి స్థాయిలో పంటల సాగు సాగు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 275.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 176.1 మిల్లీమీటర్ల నమోదై 36 శాతం తక్కువ వర్షపాతం కురిసిందని, జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు వచ్చి సెప్టెంబర్ నెలలో మాత్రం సాధారణ వర్షపాతం వచ్చిందని, జిల్లాలో 3,43,394 హెక్టార్లలో పంటలు సాగు చేపటాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,78,407 హెక్టార్లలో సాగై 81 శాతం పంటలు సాగు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకొని మిగిలిన హెక్టార్లలో కూడా పంటలు సాగులోకి తీసుకురావాలని, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే 98 శాతంపైగా పూర్తి కాగా, నెలాఖరులోగా పూర్తిగా చేపట్టాలన్నారు. జిల్లాలో 302 రైతు సేవా కేంద్రాల పరిధిలో హాఫ్ మూన్ మోడల్ లో కేటాయించిన పంటల సాగు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్.నినో పరిస్థితులు నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఏపీఎంఐపీ, ఏపీసీఎన్ఎఫ్, మార్కెటింగ్, ఫిషరీస్, మార్క్ఫెడ్, డిఆర్డిఏ, డ్వామా, తదితర శాఖల పరిధిలో ఆయా కార్యక్రమాల ప్రగతి, అభివృద్ధి గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిసిఓ అరుణకుమారి, డిఎస్ఓ శోభారాణి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శైలజ, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం డా.నవీన్, జిల్లా ఫిషరీస్ అధికారి విజయకృష్ణ, ఆత్మ పిడి, మార్కెటింగ్, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన తిక్కారెడ్డి



**మంత్రాలయం , సెప్టెంబర్ 23,మనం న్యూస్ ;-** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కటికే రెహమాన్ తల్లి కటికే రంజాన్ బి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ విషయాన్ని నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు మాధవరం అమర్నాథ్ రెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన మాధవరం గ్రామానికి వెళ్ళి టీడీపీ కార్యకర్త రెహమాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి , ధైర్యంగా ఉండాలని , ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ కార్యకర్త రెహమాన్ కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట టీడీపీ యువ నాయకులు కృష్ణమోహన్ రెడ్డి , మీడియా కో ఆర్డినేటర్ విజయరామిరెడ్డి , టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా అధికారుల సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని వై యస్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయసూర్య, ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమము సెప్టెంబర్ 25 వ తేదీ 2026 శుక్రవారం న హాజరై. ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరిస్తారని మరియు ప్రజల సమస్యల పరిష్కారమునకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని.మండల తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, తెలియజేశారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారికున్న సమస్యను అర్జీ రూపకంగా విన్నవించుకున్న ఎడల



ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని. ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు డివిజనల్ అధికారులు మరియు మండల స్థాయి అధికారులు కూడా హాజరు కావడం జరుగుతుందని ఆయన తెలియజేశారు

## గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జట్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి , పాతూరి రాంప్రసాద్ చౌదరి , పుల్ల బాబి , ప్రభుత్వ అధికారులు , ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నషాముక్త్ యువ భారత్ కోసం యువత భాగస్వామ్యం కావాలి

- ఎస్వీకెపి కళాశాలలో జిల్లాస్థాయి పోటీలు



**వాసవి పెనుగొండ, మనం న్యూస్:** భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'వికసిత్ భారత్'లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషాముక్త్ యువ భారత్ సంకల్ప అభియాన్ లో భాగంగా జిల్లాస్థాయి పోటీలను పెనుగొండలోని ఎస్వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించి దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పశ్చిమగోదావరి జిల్లా మై భారత్ డైరెక్టర్ రాహుల్ గిర్రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు వచ్చి చదువుకోవడం, ఆటల్లో పాల్గొనడం మాత్రమే విద్యార్థుల జీవిత లక్ష్యం కాదన్నారు. ప్రభుత్వం యువత కోసం అమలు చేస్తున్న అనేక ఉన్నతమైన కార్యక్రమాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈగల్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వైపు ప్రోత్సహించే వారు చట్టపరంగా శిక్షార్హులని తెలిపారు. 'బ్రేక్ ది సైలెన్స్' అనే నినాదంతో మాదకద్రవ్యాలపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. డ్రగ్స్ సమస్య వ్యక్తిగత సమస్య కాదని, ఇది దేశానికి సంబంధించిన సమస్య అని అన్నారు. యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా మార్చడం ద్వారా దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
మాదకద్రవ్యాల విక్రయం, సరఫరాకు సంబంధించి చట్టంలో కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి కె. సుజాత మాట్లాడుతూ నషాముక్త్ భారత్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. తాము మాత్రమే మారడం కాకుండా తమ చుట్టూ ఉన్నవారిని కూడా మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆచరణలో పెట్టి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని మై భారత్ ప్రతినిధి ప్రేమ్సింగ్ నేతృత్వంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బాపిరెడ్డి, ఎన్సీసీ అధికారి డాక్టర్ కె. చిరంజీవి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్.ఎస్. శ్రీనివాస్, పి. మీరయ్య, టి. దివాకర్ పర్యవేక్షించారు.కార్యక్రమంలో జె. మురళీకృష్ణ, కె.వి. సురేష్బాబుతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి బిజెపి లక్ష్యం



- ఆదోని ఎంఎల్ఏ పార్థసారథి
- మాలపల్లి, రచ్చుమర్రి లో జెండావిష్కరణ

**మంత్రాలయం, సెప్టెంబర్ 23,మనం న్యూస్ :** అన్ని వర్గాల సంక్షేమం,అభివృద్దే బిజెపి పార్టీ లక్ష్యం అని ఆదోని ఎంఎల్ఏ పార్థసారథి అన్నారు. బుధవారం సాయంకాలం మండల పరిధిలోని మాలపల్లి, రచ్చుమర్రి గ్రామాల్లో మన ఊరు.మన జెండా కార్యక్రమం లో భాగంగా బిజెపి జెండాను ఆవిష్కరణ చేశారు. ముందుగా బిజెపి యువమోర్చ రాయలసీమ జోన్ అధ్యక్షులు బంగారయ్య, మండల అధ్యక్షులు శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. రచ్చుమర్రి లో ఆంజనేయస్వామి ని దర్శించుకొని భారీ ఊరేగింపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో అతిపెద్ద పార్టీ బిజెపి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథం లో సాగుతున్నట్లు వెల్లడించారు. రఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సునీల్ రెడ్డి,ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి,కునిగిరి నీలకంఠ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి భవన , ఇతర భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) నియోజకవర్గ సమావేశం బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగింది.అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ 19 మందికి 11,54,405/- రూపాయలు చెక్కులు అందజేయడం జరిగింది. కిలపర్తి వెంకటరావు , దాసరి అప్పన్న , రాంప్రసాద్ చౌదరి , ఈ కార్యక్రమంలో పట్టణ, పెంటపాడు అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ మరియు భూత్ ఇన్చార్జిలు నాయకులు




కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

## ఎల్ నీనో ప్రభావంపై అధికారులతో సమన్వయంతో పనిచేయాలి

**కదిరి, సెప్టెంబర్23మనంన్యూస్ :** ఎల్నినోప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, తాగునీరు, సాగునీటి లభ్యత తదితర అంశాలపై కదిరి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు పరిస్థితి, రైతుల అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, తాగునీటి లభ్యతపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అలాగే తాగునీటి



సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అవసరమైన చోట్ల తాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సిద్ధాపురంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి..
- రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి

**బుక్కపట్నం, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** బుక్కపట్నం మండలం సిద్ధాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా పర్యటించి ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును పరిశీలించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. అనంతరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, పిటిషన్ల పరిష్కారం, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తదితర వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా చూడడంతో పాటు ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. విలేజ్ క్లినిక్ను సందర్శించిన కలెక్టర్ వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలు అందించాలని, ప్రయోగశాల పరీక్షల సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాడు-నేడు పనుల పురోగతి, విద్యా కానుక, మధ్యాహ్న



భోజన నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, ఆరోగ్య పరిస్థితులు, పౌష్టికాహార పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలందరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు

# ‘ది ప్యారడైజ్’తో నా కల నిజమైంది.. : శ్రీకాంత్ ఓదెల




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’. సంచలన విజయం సాధించిన ‘దసరా’ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న మూవీ కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు పీక్స్కు చేరాయి. ఈ సినిమా మరికొద్ది గంటల్లో థియేటర్లలో గ్రాండ్గా విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. జడల్ పుట్టుక, పోరాటం కల్పితం కావచ్చునని, కానీ అతని జడలు, రూపం తన చిన్ననాటి నుండి ప్రేరణ పొందాయని శ్రీకాంత్ తెలిపారు. తాను పెరిగేకొద్దీ, ఈ సినిమాలో చాలా సన్నివేశాలు తన చిన్ననాటి జ్ఞాపకాలతో ప్రభావితమయ్యాయని తన బాల్యపు రోజులను గుర్తు చేసుకున్నారు.

తనకు ఐదేళ్ల వయసు వచ్చే వరకు అమ్మ జడలు వేసి కట్టేదని, పెద్దయ్యాక కమర్షియల్ సినిమాలో 70ఌతెరపై జడలతో హీరో ఎలా కనిపిస్తాడో అని ఎప్పుడూ ఊహించుకునేవాడినని చెప్పారు. ఇక ఇప్పుడు ఆ కల నిజమైందని చెబుతూ.. జడల్తో ఉన్న తన హీరో నాని అన్నను అందరికీ పరిచయం చేస్తున్నానని, ఈ చిత్రం కేవలం తన కల మాత్రమే కాదని, ఇది తన స్వర్గం అని భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని గంటల్లో అందరికీ ‘ది ప్యారడైజ్’ ప్రపంచంలోకి స్వాగతం అంటూ ఆయన చేసిన ఈ పోస్ట్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. నాని మాస్ యాక్షన్ అవతార్ను బిగ్ స్క్రీన్పై చూసేందుకు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# చైనా చేతిలో ఓటమి.. కాంస్యంతో సరిపెట్టుకున్న భారత జట్టు




ఆసియా క్రీడలు-2026 టోర్నీ పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్లో భారత్కు చుక్కెదురైంది. సెమీ ఫైనల్లో భారత జట్టు చైనా చేతిలో ఓడిపోయింది. తద్వారా కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెమీస్ లో డిఫెండింగ్ చాంపియన్ చైనాతో తలపడ్డ భారత జట్టు ఆరంభంలో అలరించినా ఆ తర్వాత ప్రత్యర్థి ముందు తలొగ్గింది. సింగిల్స్లో షి యు కీ చేతిలో లక్ష్య సేన్ 21-16, 21-18 పాయింట్ల తేడాతో ఓడిపోగా.. డబుల్స్లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి.. లియాంగ్ వెయ్ కెంగ్, వాంగ్ చాంగ్లపై 21-11, 22-20 తేడాతో గెలిచారు.

ఇక మూడో మ్యాచ్లో లి షి ఫెంగ్ ఆయుశ్ శెట్టిని 21-19, 21-13 తేడాతో ఓడించగా.. నాలుగో మ్యాచ్లో హి ఝి టింగ్, లియూ యీ- హరిహరన్ అమ్సకరుణన్, ఎంఆర్ అర్జున్లపై 21-16, 18-21, 21-9 తేడాతో విజయం సాధించారు. దీంతో భారత బ్యాడ్మింటన్ జట్టు చైనా చేతిలో 3-1 తేడాతో ఓటమిపాలైంది. దీంతో భారత్ కాంస్యానికి పరిమితమైంది.

**ఇప్పటి వరకు లభించిన పతకాలు ఇవే**

కాగా ఆసియా క్రీడల తాజా ఎడిషన్లో భారత్ ఇప్పటి వరకు ఒకే ఒక్క స్వర్ణం గెలిచింది. భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్లో శ్రీలంకను ఓడించి పసిడి పతకం సాధించింది. ఇక మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రజతం, మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఇలవేనిల్ వలరివన్ రజతం గెలవగా.. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రజతం, పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో హిమాన్షు ధిల్లాన్ రజతం వచ్చాయి.

ఇక మహిళల 49 కిలోల వెయిట్లిఫ్టింగ్ విభాగంలో మీరా బాయి చాను వెండి పతకం గెలవగా.. రుద్రాంక్ష్ పాటిల్ (షూటింగ్), సుచిక తరియాల్ (మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్) కాంస్యం కైవసం చేసుకున్నారు. మహిళల, పురుషుల స్కీట్ టీమ్లో కాంస్యాలు వచ్చాయి. ఇక మెన్స్ సింగిల్స్ సాఫ్ట్ టెన్నిస్లో జై మీనా కాంస్యం గెలిచాడు.

# అప్పుడు మల్లీశ్వరి.. ఇప్పుడు మీరాబాయి ఆసియా గేమ్స్‌లో 28ఏళ్ల ‘వెయిట్’ ఓవర్

ఆసియా గేమ్స్లో వెయిట్లిఫ్టింగ్ మెడల్ కోసం భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 28 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో మన వెయిట్లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు పతకం సాధించింది. జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 49కేజీల విభాగంలో ఆమె రజతాన్ని ముద్దాడింది. అంతేకాదు..




ఆసియా క్రీడల్లో (అటెమ్ట్స్ ఎర్రుప్ట్) మెడల్ రాలేదన్న వెలితి కూడా చానుకు ఇప్పుడు తీరిపోయింది.

బుధవారం జరిగిన పోటీల్లో మీరాబాయి చాను స్నాచ్లో 87 కేజీలు, క్లీన్ అండ్ జర్క్లో 111 కేజీలు ఎత్తింది. మొత్తంగా 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన ఉత్తరకొరియా వెయిట్లిఫ్టర్ రి సాంగ్ గమ్.. రికార్డు స్థాయిలో మొత్తం 215 కేజీలు (స్నాచ్లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్లో 121 కిలోలు) ఎత్తి బంగారు పతకం సాధించింది. ఆసియా గేమ్స్లో వెయిట్లిఫ్టింగ్ విభాగంలో భారత్కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. చివరిసారిగా 1998లో జరిగిన ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి రజతం సాధించింది. ఇక, ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్షిప్, కామన్వెల్త్ ఇలా అంతర్జాతీయ టోర్నీల్లో అనేక పతకాలు సాధించినా.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆమె ఇప్పటివరకు మెడల్ తీసుకోలేదు. నేటితో ఆ కొరత తీరింది. మీరాబాయి చాను గతంలో టోక్యో ఒలింపిక్స్లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.




# ‘రూట్’ సంచలన నిర్ణయం.. క్రికెట్‌కు గుడ్‌బై

ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్ సోదరుడు, గ్లామోర్గాన్ స్టార్ బిల్లీ రూట్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ ఏడాది డొమాస్టిక్ సీజన్ తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్కు వీడ్కోలు పలకనున్నట్లు రూట్ ప్రకటించాడు. 34 ఏళ్ల రూట్ 2017లో నాటింగ్హామ్షైర్ క్లబ్ తరపున ప్రొఫెషనల్ క్రికెట్లోకి అడుగుపెట్టాడు. రెండేళ్ల తర్వాత అతడు 2019లో గ్లామోర్గాన్ క్లబ్తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గ్లామోర్గాన్ క్లబ్ 2021, 2024 లలో వన్డే కప్ టైటిల్స్ గెలవడంలో బిల్లీ రూట్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ 83 ఫస్ట్-క్లాస్, 60 లిస్ట్-ఎ, 50 టీ20 మ్యాచ్లు ఆడి 6406 పరుగులు సాధించాడు.

అతడి పేరిట 7 ఫస్ట్ క్లాస్, 3 లిస్ట్-ఎ సెంచరీలు ఉన్నాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో రూట్ అత్యధిక స్కోర్ 229 పరుగులగా ఉంది. అయితే ప్రస్తుత కౌంటీ సీజన్లో బిల్లీ అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోతున్నాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్లో కేవలం 28 పరుగులు మాత్రమే చేయగలిగాడు. గత సీజన్లోనూ ఇదే తీరు కనబరిచాడు.

ఐదు మ్యాచ్లు కేవలం 56 పరుగులు మాత్రమే సాధించగలిగాడు. తన పేలవ ఫామ్ కారణంగా అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా మంగళవారం మరో గ్లామోర్గాన్ లెజెండ్ కొలిన్ ఇంగ్రామ్ కూడా తన 22 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్కు ముగింపు పలికాడు.

# శర్వానంద్‌కు జోడీగా మానస వారణాసి



టాలీవుడ్లో దూసుకుపోతున్న యంగ్ బ్యూటీ మానస వారణాసి మరో క్రేజీ ప్రాజెక్ట్ను తన ఖాతాలో వేసుకుంది. ‘దేవకి నందన వాసుదేవ’ సినిమాతో టాలీవుడ్లోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు, రీసెంట్గా వచ్చిన ‘కపుల్ ఫ్రెండ్లీ’ మూవీతో భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇలా వచ్చిన రెండు సినిమాలతోనే యూత్లో భారీ ఫాలోయింగ్ను సంపాదించుకుంది. అయితే గత కొంతకాలంగా ఈ భామ టాలీవుడ్లో మరో స్టార్ హీరో సరసన నటించబోతుందంటూ జోరుగా ప్రచారం సాగింది. తాజాగా, ఆ రూమర్స్ను నిజం చేస్తూ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. టాలెంటెడ్ హీరో శర్వానంద్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ‘జా ర్రిజ్ష్’ చిత్రంలో హీరోయిన్గా మానస వారణాసి ఎంపికైనట్లు మేకర్స్ ప్రకటించారు. ‘ఒక రిఫ్రెషింగ్ కపుల్ను రాబోయే సంక్రాంతి స్పెషల్ ఎంటర్టైనర్లో బిగ్ స్క్రీన్పై చూసేందుకు సిద్ధంకండి‘ అంటూ అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇచ్చారు. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్ల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఫుల్ లెంత్ ఎంటర్టైనర్గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది పొంగల్ కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.


# టాలీవుడ్‌లో మరో సెన్సేషన్.. డ్యాన్సర్స్ అసోసియేషన్ కార్యవర్గం రద్దు




టాలీవుడ్లో డ్యాన్సర్ల సంఘం వ్యవహారం పీక్స్కు చేరింది. ఈ క్రమంలోనే ఇవాళ టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్ లో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో హైకమాండ్ తరహాలో ఫెడరేషన్ పెద్దలు రంగంలోకి దిగి కీలక చర్యలు చేపట్టారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదంపై చర్చించేందుకు ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు సుమలత, రఘు మాస్టర్ తో సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి మొత్తం 225 మంది డ్యాన్సర్లు హాజరయ్యారు. సమావేశంలో సభ్యుల మద్దతుపై జరిగిన పరిశీలనలో ఇరువర్గాల బలాబలాలు స్పష్టంగా బయటపడ్డాయి. ఈ మద్దతు సేకరణలో సుమలతకు కేవలం 11 మంది డ్యాన్సర్లు మాత్రమే మద్దతు తెలపగా, రఘు మాస్టర్ కు ఏకంగా 214 మంది డ్యాన్సర్లు పూర్తి మద్దతు ప్రకటించారు.

**కార్యవర్గం రద్దు, ఎన్నికల తేదీ ఖరారు..**

సమావేశంలో వెల్లడైన డ్యాన్సర్ల మద్దతు ఆధారంగా ఫిల్మ్ ఫెడరేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న సుమలత కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నట్లుగా ఫిల్మ్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయం అనంతరం డ్యాన్సర్స్ అసోసియేషన్ కు కొత్త కార్యవర్గ ఏర్పాటు కోసం ఎన్నికల షెడ్యూల్ను వెల్లడించారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ కు రాబోయే అక్టోబర్ 11న ఎన్నికలు నిర్వహించాలని ఫెడరేషన్ అధికారికంగా నిర్ణయించింది.



# అత్యున్నత స్థాయి సినిమా అనుభూతిని అందించడానికి కష్టపడుతున్నాం: అల్లు అర్జున్

అత్యంత భారీ అంచనాలతో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ ‘రాకా’. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్లో తెరకెక్కుతోంది. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్గా నటిస్తోంది. అయితే ఈ సినిమా ఇప్పుడో అరుదైన ఘనత సాధించి గ్లోబల్ లెవెల్లో ట్రెండ్ అవుతోంది. షూటింగ్ దశలోనే ఈ చిత్రం ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్ రికార్డ్ను సొంతం చేసుకుంది. ‘రాకా’ చిత్రంలో ఒకేసారి అత్యధిక మంది పెర్ఫార్మర్లను రియల్ టైమ్లో ఏకకాలంలో మోషన్ క్యాప్చర్ చేసిన సినిమాగా ఈ రికార్డ్ కెక్కింది. ఏకంగా 37 మంది పెర్ఫార్మర్లను లైవ్ మోషన్ క్యాప్చర్ ద్వారా బంధించి గిన్నిస్ బుక్లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ఈవెంట్లో అల్లు అర్జున్ ఎమోషనల్ కామెంట్స్ చేశారు.



‘ఇక్కడ ఉండటం నాకు ఎంతో గర్వకారణం, ఇది నాకు ఎంతో వినమ్రతను కలిగించే విషయం. ప్రపంచ సినిమాకు కొత్త ప్రమాణాలను నెలకొల్పి, ఈ చిత్రం ఒక అద్భుతమైన ఘనతను సాధించినందుకు మేము ఎంతో గర్విస్తున్నాం‘ అని బన్నీ పేర్కొన్నారు. ఇక సినిమా విడుదల కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులనుద్దేశించి అల్లు అర్జున్ ఒక విజ్ఞప్తి చేశారు. ‘సినిమా ప్రేమికులకూ, అభిమానులందరికీ నేను ఒకటే చెప్పాలనుకుంటున్నాను.. మేము ఈ ప్రాజెక్ట్ కోసం తగినంత సమయం తీసుకుంటున్నామని మాకు తెలుసు, కానీ దయచేసి మా పట్ల కొంచెం ఓపిక వహించండి. మీకు థియేటర్లలో ఎప్పటికీ గుర్తుండిపోయే అత్యున్నత స్థాయి సినిమా అనుభూతిని అందించడానికి కష్టపడుతున్నాం. మీరందరూ మరికొంత కాలం వేచి ఉండాలని కోరుకుంటున్నాను, ఆ నిరీక్షణకు వందశాతం తగిన ఫలితం దక్కుతుంది‘ అని బన్నీ భరోసానిచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.